మూడు దశాబ్దాల తర్వాత పులివెందుల,
ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికలు
నిజమైన ప్రజాస్వామ్యాన్ని చూశాయి.
భయాన్ని జయించి స్వేచ్ఛగా పోటీ
చేశారు, స్వేచ్ఛగా ఓటేశారు.ఈ చారిత్రక
ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి కొత్త
అధ్యాయాన్ని రాష్ట్ర రాజకీయాల్లో
లిఖించబోతోంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 14.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 123 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా ఏపీ

**విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు**

**రెన్యువబుల్ ఎనర్జీలో వ్యయం తగ్గింపే కీలకం**

**వినియోగదారులపై టారిఫ్ భారం లేకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు**

**విద్యుత్ సరఫరా, పెట్టుబడులు, ఛార్జీల భారం తగ్గింపు తదితర అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గ్రీన్ ఎనర్జీ కారిడార్ గా ఏపీని తీర్చిద్దిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకీ మారుతున్న డైనమిక్స్ కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, విద్యుత్ ప్రాజెక్టులు, పెట్టుబడులు, విద్యుత్ ఛార్జీల భారం తగ్గింపు తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కే.విజయానంద్, ఏపీ ట్రాన్స్ కో, జెన్ కో అధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ వేగంగా విస్తరించి జన జీవనంలోకి వచ్చేసిందని.. ఇక భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదేనని సీఎం స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో వ్యయం ఎలా తగ్గించాలన్న అంశంపై అధ్యయనం చేసి ప్రజలకు ఆ ప్రయోజనాలను అందించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వచ్చే రెండు మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం మరో 8.9 శాతం మేర పెరిగే అవకాశముందన్న సీఎం అందుకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికతను వినియోగించి గ్రీన్ ఎనర్జీలో అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అన్నారు. మరోవైపు రాష్ట్రంలోని వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం మోపేందుకు వీల్లేదని సీఎం అధికారులకు తేల్చి చెప్పారు. నాన్ టారిఫ్ ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్ కో వేసిన ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ ను లీజుకు ఇవ్వటం ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించాలని సూచించారు. ఈ మార్గం ద్వారా దాదాపు రూ. 7 వేల కోట్ల వరకూ ఆదాయం వచ్చే అవకాశముందని సీఎం అన్నారు.

**బహిరంగ మార్కెట్ లో విద్యుత్ కొనుగోళ్లు తగ్గించాలి :** రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటిని తగ్గించేందుకు ఫీడర్లను సమర్ధంగా నిర్వహించటంతో పాటు ఆయా కేటగిరీల వారిగా విభజించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ను స్థానికంగానే వినియోగించుకునేలా చేయటం ద్వారా ట్రాన్స్ మిషన్ నష్టాలను తగ్గించుకునేందుకు ఆస్కారం ఉంటుందని ముఖ్యమంత్రి సూచించారు. ట్రాన్స్ మిషన్ లైన్లను ఆధునీకరించి సరైన నిర్వహణ చేపడితే పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గించుకోవచ్చని అన్నారు. గతంలో ఎనర్జీ ఆడిటింగ్ ద్వారా విద్యుత్ చౌర్యం, పంపిణీ నష్టాలను వెలుగులోకి తెచ్చామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ ఆడిటింగ్ చేపట్టిన తర్వాతే ఉత్పత్తి, సరఫరా, పంపిణీలను సమర్ధంగా నిర్వహించగలిగామని వెల్లడించారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగంపై లోతైన అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే బహిరంగ మార్కెట్ లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని సీఎం అధికారులకు సూచించారు.

మిగతా 2లో...

## భారీ వర్షాల నేపథ్యంలో.. అప్రమత్తం

**వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రజలకు తక్షణ సమాచారం**

**రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు హాజరయ్యారు. విపత్తు నిర్వహణ, వ్యవసాయం, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ అత్యవసర సమీక్షలో పాల్గొన్నారు.

మిగతా 2లో...



## వైసిపి నేతలే బెదిరించారు.. టిడిపి ఆరోపణ



- పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల రగడ.. వైసీపీపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- ఒంటిమిట్ట, పులివెందుల ఉపఎన్నికలపై తీవ్ర దుమారం
- దౌర్జన్యానికి పాల్పడ్డ వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు అప్రజాస్వామికంగా వ్యవహరించారని, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరించి, దూషణలకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఆరోపించింది.

మిగతా 2లో...

## జిల్లాల మార్పులపై ముందడుగు

**వచ్చేనెల 15 నాటికి జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై జీవోఎం నివేదిక**

**ఈనెల 29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మంత్రుల పర్యటన**

**ప్రజా ప్రతినిధులు, ప్రజల నుండి వినతుల స్వీకరణ**

మిగతా 2లో...




## అరాచకాలు జరగలేదని జగన్‌కు అసహనం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల ప్రజలు ఇప్పుడిప్పుడే అరాచకం నుంచి బయటపడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పార్టీ కేంద్ర పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం సీఎం చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పలువురికి ఆర్థిక సాయం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలపై అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు సమాధానమిచ్చారు.

"వైయస్ హయాం నుంచి పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగలేదు. ఈసారి అరాచకాలు జరగలేదనే అసహనంతో జగన్ ఉన్నారు. ఆయన వైఖరి ఏలాంటిదో ప్రజలకు తెలిసిందే.

మిగతా 2లో...




## న్యాయమూర్తులుగా నలుగురు ప్రమాణ స్వీకారం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో నలుగురు అదనపు న్యాయ మూర్తులు న్యాయమూర్తులుగా ప్రమాణం చేశారు.రాష్ట్ర హైకోర్టులో ఇప్పటి వరకూ అదనపు న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ హరినాధ్ నూనెపల్లి,జస్టిస్ కిరణ్మయి మండవ (కిరణ్మయి కనపర్తి),జస్టిస్ సుమతి జగడం,జస్టిస్ న్యాపతి విజయ్ లను న్యాయమూర్తులుగా నియమిస్తూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలకు అనుగుణంగా బుధవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మొదటి కోర్టు హాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆనలుగురు అదనపు న్యాయమూర్తులచే న్యాయమూర్తులుగా ప్రమాణం స్వీకారం చేయించారు.

మిగతా 2లో...



## వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు

**పుణె (జర్నలిస్ట్ ఫైల్) :** వి.డి.సావర్కర్ ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు.

మిగతా 2లో...



## ఓట్ల చో రీకి మూలం వైసిపినే



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల ప్రజలకు భయం పోయింది.. జగన్‌కు భయం పట్టుకుందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్రిక్తతలు సహజమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పారు. జగన్ హయాంలో పోలీసులపై అనేక ఒత్తిళ్లు పెట్టారని, తమ ప్రభుత్వంలో ఆ శాఖ స్వచ్ఛందంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. "గతంలో వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డిని సీబీఐ కూడా టచ్ చేయలేకపోయింది. అరెస్టు చేయడం సాధ్యం కాదని గతంలో నివేదికలు పంపారు. కానీ మా ప్రభుత్వంలో కానిస్టేబుల్ వెళ్లి అవినాష్‌రెడ్డిని అడ్డుకున్నారు. వైకాపా నేతలు ప్రజాస్వామ్యంపై మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది. ప్రజలు,

మిగతా 2లో...

## లాభాపేక్ష లేకుండా క్యాన్సర్ ఆస్పత్రి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్.. రాజధాని అమరావతిలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన భూమిపూజను తుళ్లూరు సమీపంలో బుధవారం ఉదయం సంస్థ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిర్వహించారు.

అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 2019లో శంకుస్థాపన జరిగిందన్నారు. తర్వాత కొన్ని అంధకార పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. దీంతో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టలేకపోయినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నేతృత్వంలో పనులు చేపట్టామన్నారు. ఇవాళ పండగ వాతావరణంలో పనులు ప్రారంభించినట్లు వివరించారు.

"క్యాన్సర్ ఆసుపత్రి లాభాపేక్ష కోసం కాదు.

మిగతా 2లో...

## ఇవి ప్రజాస్వామ్యం ఎన్నికలా?



- పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలి
- కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలి
- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధ్వర్యాన తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి కోరారు.

మిగతా 8లో...

## ఆక్వా యూనిట్లు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- రాష్ట్ర ఆక్వాకల్చర్ రంగాన్ని ప్రపంచ స్థాయిలో నిలుపుతాం
- ఆక్వా రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది
- రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఆక్వాకల్చర్ రంగాన్నిఅంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో నిలుపుతామని వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలోని మత్స్య సంపద, ఉత్పత్తి నాణ్యత, ఎగుమతి అవకాశాలు, మరియు రైతుల ఆదాయాన్ని పెంచే విధానాలపై సమగ్రంగా అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో అక్వాకల్చర్ అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మత్స్యశాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ అనుకూల పద్ధతులు, శాస్త్రీయ విధానాల వినియోగం ద్వారా ఉత్పత్తి పెంపుతో పాటు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్ స్థాయిని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మత్స్యకారులు, ఆక్వారైతులు, పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పర్యావరణం మరియు ప్రజారోగ్యం రక్షణ ప్రథమ కర్తవ్యమని,

మిగతా 2లో...

## అరాచకాలు జరగలేదని జగన్‌కు అసహనం

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ వేసేందుకే భయపడే పరిస్థితి నుంచి 11 మంది పోటీ చేశారు. రెండు పోలింగ్ బూత్‌ల్లో ఎప్పుడైనా రీపోలింగ్ జరిగిందా? శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నాయి కనుకే ప్రజలు ధైర్యంగా ఓటేశారు” అని చంద్రబాబు పేర్కొన్నారు.
మరోవైపు రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పలువురు మరణించడం బాధాకరమన్నారు. నష్ట నివారణకు ఎక్కడికక్కడ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు సమన్వయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

## వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు.
2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ అప్లికేషన్ సమర్పించారు.
“తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత” అని అందులో పేర్కొన్నారు.
విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

## వైసిపి నేతలే బెదిరించారు.. టిడిపి ఆరోపణ

(మొదటి పేజీ తరువాయి)


ఈ మేరకు బుధవారం నాడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ నేతృత్వంలోని బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)ను కలిసి ఫిర్యాదు చేసింది. వైసీపీ నేతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడి, వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు.
**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే జగన్ ఓర్వలేరా?: వర్ల రామయ్య**
టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ, “ఐదేళ్ల రాక్షస పాలనను జగన్ రెడ్డి అప్పుడే మరిచిపోయి, 15 నెలల చంద్రబాబు పాలనపై విమర్శలు చేయడం దొంగే దొంగ అన్నట్లుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్లు కూడా వేయనీయకుండా ప్రత్యర్థులపై దాడులు చేయించి, వారి ఇళ్లలో సారా సీసాలు పెట్టి అరెస్టులు చేయించిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజలు మూడు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటు వేస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని వ్యక్తిగతంగా దూషించడం, ఆయన శరీరాకృతిని కించపరచడం చట్టరీత్యా నేరం. పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి, అధికారులను బెదిరిస్తున్న వైసీపీ నేతలపై ఈసీ వెంటనే చర్యలు తీసుకోవాలి” అని డిమాండ్ చేశారు.
**అసెంబ్లీకి రావడానికే జగన్‌కు భయం: దేవినేని ఉమ**
మాజీ మంత్రి దేవినేని ఉమ మాట్లాడుతూ, “గత 30 ఏళ్లుగా పులివెందుల, కడప జిల్లాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఇప్పుడు అదే జగన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. గతంలో వేల స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న చరిత్ర వారిది. ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగితే రీపోలింగ్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. అసెంబ్లీకి రావాలంటేనే జగన్‌కు ధైర్యం చాలడం లేదు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎన్నికలు అద్భుతంగా జరిగితే, ఆయనపై విమర్శలు చేస్తున్నారు. రేపటి ఫలితాల్లో ఓటమి ఖాయమని తెలిసే జగన్ ఈ ప్రెస్ మీట్లు పెడుతున్నారు. వివేకా హత్య కేసులో సొంత చెల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వ్యక్తి జగన్. పోలీసులపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేసిన వారిపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలి” అని అన్నారు.
**అసలైన రాక్షస పాలన జగన్‌దే: పంచుమర్తి అనురాధ**
మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ, “31 క్రిమినల్ కేసుల్లో ఉన్న జగన్ రెడ్డి, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుపై విమర్శలు చేయడం విడ్డూరం. ‘తల్లికి వందనం’ పథకాన్ని విమర్శిస్తున్న మీరు, అమ్మఒడి పేరుతో ప్రజలను మోసం చేశారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేసి, ఇప్పుడు అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందించే ప్రయత్నాన్ని రాక్షస పాలన అనడం మీ అవివేకానికి నిదర్శనం” అని విమర్శించారు.
**వైసీపీ గుర్తింపు రద్దు చేయాలి: ఎమ్మెల్యే బోడె ప్రసాద్**
ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, “జగన్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి. అధికారం కోల్పోయినా ఆయనలో అహంకారం తగ్గలేదు. అధికారులను, ముఖ్యమంత్రిని దూషిస్తున్న ఆయన మానసిక స్థితి బాగోలేదు. ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలి” అని డిమాండ్ చేశారు.
ఈసీని కలిసిన వారిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీకి మూలం వైసిపినే

(మొదటి పేజీ తరువాయి)

క్యాడర్‌ను రెచ్చగొట్టేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారు. పులివెందుల ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారు. రేపు వచ్చే ఫలితాలను స్వీకరించేందుకు జగన్ సిద్ధంగా ఉండాలి. అసెంబ్లీ ఫలితాలనే జగన్ ఇంకా స్వీకరించడం లేదు. ఓటమికి కారణాలు వెతుక్కోవడం వైకాపా నేతలకే చెల్లింది. పోలీసులు సరిగా పనిచేయడాన్ని ఆ పార్టీ భరించలేకపోతోంది. ఓట్ల చోరీకి మూలం వైకాపానే కదా. ఉరవకొండ, తిరుపతి, విశాఖ, పర్చూరును మర్చిపోయారా? మేం ప్రజలను నమ్ముకున్నాం.. మీరు దొంగ ఓట్లను నమ్ముకున్నారు” అని మంత్రి పయ్యావుల వ్యాఖ్యానించారు.

## ప్రకాశం బ్యారేజీకి పెరిగిన వరద ఉద్ధృతి..



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా నదికి వరద ఉద్ధృతి పెరుగుతోంది. ఈ క్రమంలో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వస్తోన్న వరద దృష్ట్యా అధికారులు బ్యారేజీ 39 గేట్లు పూర్తిగా, 31 గేట్లు 8 అడుగుల మేర ఎత్తి 3,63,438 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. వరద ప్రవాహం అధికంగా ఉన్న నేపథ్యంలో కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# గ్రీన్ ఎనర్జీ కారిడార్ గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతీ యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ. 4.80 పైసలకు తగ్గించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు సెన్సార్లు, డ్రోన్లు ఇతర సాంకేతిక పరికరాల సాయంతో ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితుల్ని అంచనా వేసి అవసరమైన మేరకు విద్యుత్ ఉత్పత్తిని పెంచుకునేందుకు ఆస్కారం ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో విద్యుత్ వినియోగం 270 మిలియన్ యూనిట్ల వరకూ పెరిగిందని.. వ్యవసాయానికి కూడా విద్యుత్ వినియోగం పెరిగినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి 2026 మార్చి నెలల మధ్య కూడా 12,700 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. దీనిపై స్పందించిన సీఎం విద్యుత్ డిమాండ్‌కు తగినట్టుగా ఉత్పత్తి పెంచుకోవాలని ఆదేశించారు. కొనుగోళ్లను తగ్గించేందుకు పవర్ స్వాపింగ్ లాంటి విధానాలను అనుసరించాలని సూచించారు.
విద్యుత్ ఉత్పత్తి వ్యయం పై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశమున్న ప్రాంతాలను అన్వేషించాలని సూచించారు. విండ్ పొటెన్షియల్ ఉన్న ప్రాంతాల్లో ఆయా ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని తద్వారా వ్యయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ ప్రతీ యూనిట్ కు రూ. 5-6 మేర వ్యయం అవుతోందని.. పవన విద్యుత్ కేవలం రూ4.6కే యూనిట్ ఉత్పత్తి అవుతోందని అన్నారు. ఏపీలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని అన్నారు. అటు పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాయలసీమలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ రూ. 3.19 లక్షల కోట్ల ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు వివరించారు.



**సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టు వేగవంతం కావాలి :**
రాష్ట్రంలో పీఎం- సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ బీసీలతో పాటు ఇతర వర్గాలకు సోలార్ రూఫ్ టాప్ కింద ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేశారన్న అంశాన్ని ఎప్పటికప్పుడు తెలియచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ పురోగతిపై ప్రతీ నెలా తానే స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టామని, దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అన్ని విద్యుత్ సంస్థలు అందించే పౌర సేవల్ని వాట్సప్ మన మిత్ర ద్వారా అందించాలని పేర్కొన్నారు.
ఏపీ జెన్కో థర్మల్ యూనిట్లకు అవసరమైన బొగ్గు సేకరణలోనూ కేంద్ర నుంచి సహకారం కోరాలని సూచించారు. మరోవైపు విద్యుత్ ప్రమాదాలు, లో వోల్టేజి సమస్యలు, లీకేజీలు రాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని స్పష్టం చేశారు. పాత పడిన విద్యుత్ లైన్లను కూడా ఏఐ ద్వారా విశ్లేషించి వాటిని మార్చాలని సీఎం సూచించారు. దీని కోసం ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ సాంకేతికతను ఉపయోగించాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

## జిల్లాల మార్పులపై ముందడుగు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై వచ్చే నెల 15 తేదీ నాటికి తమ నివేదిక సీఎం చంద్రబాబుకు సమర్పించాలని మంత్రుల బృందం(జీవోఎం) నిర్ణయించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తోపాటు ఏడుగురు మంత్రులతో ఏర్పాటైన జీవోఎం తొలిసారిగా బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో భేటి అయ్యింది. ఈ సమావేశానికి మంత్రి అనగానితోపాటు మంత్రులు పి.నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ తోపాటు రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిసెంబర్ 31లోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుల ప్రక్రియ మొత్తంగా ముగించాల్సి ఉన్నందున జీవోఎం తన నివేదికను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి సీఎం చంద్రబాబు నాయుడుకి అందజేస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గత ప్రభుత్వం జిల్లాల పునర్వీభజన సక్రమంగా చేయని కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటన్నింటిని సరిచేసేందుకే జీవోఎంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో మంత్రుల బృందం రెండు గ్రూపులుగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తుందని, ఆ సమయంలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం వద్దకు వచ్చిన అనేక సూచనలపై చర్చించామని, రానున్న కాలంలోనూ వినతులు స్వీకరించి వాటన్నింటినీ క్రోడికరించి సెప్టెంబర్ 15వ తేదీ నాటికే నివేదికను సీఎంకు అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఇప్పటి నుండే కలెక్టర్లకు తమ వినతులను ఇవ్వొచ్చునని, వినతులు ఇచ్చేందుకు సెప్టెంబర్ 2 అఖరు తేదీ అని చెప్పారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుల తోపాటు కొత్త జిల్లాల ఏర్పాటు అంశాన్ని కూడా జీవోఎం పరిశీలిస్తుందని చెప్పారు. అయితే నియోజకవర్గాలతో జీవోఎంకు సంబంధం లేదని, వాటి జోలికి పోవడం లేదని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు అందుబాటులో ఉండటం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం లక్ష్యంగా తమ సూచనలు ఉంటాయని చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రాలతోపాటు గిరిజనులకు అందుబాటులో ఉండేవిధంగా రెండు గిరిజన ప్రాంతాలను కూడా మంత్రుల బృందం పర్యటించి వారి నుండి అభిప్రాయాలు తీసుకుంటుందని చెప్పారు.



**ప్రజల నుండి వినతులు :** జీవోఎం సమావేశం జరుగుతూ ఉండగానే దాదాపు 15 మంది జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుపై మంత్రుల బృందానికి తమ వినతులను సమర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే చీరాల నుండి వచ్చిన కొందరు బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య పేరు పెట్టాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా మురపాక నుండి వచ్చిన బివిఎస్ నాయుడుతోపాటు ఆ గ్రామస్తులు తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. క్రిష్ణా జిల్లా మడిచర్ల గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ మరియు ఆ గ్రామ ప్రజలు తమ గ్రామాన్ని బాపులపాడు మండలం నుండి తీసేసి నూజీవీడు మండలంలో గానీ, ముసునూరు మండలంలో గానీ కలపాలని కోరారు.

## న్యాయమూర్తులుగా నలుగురు ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం,అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ,అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ నారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో .. అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ శాఖ సూచనల మేరకు రాగల రెండు మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తత చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువన ఉన్న ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం కృష్ణా నదిలో రేపటికల్లా 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుంచి 3.09 లక్షల క్యూసెక్కుల నీరు 35 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాలువలకు 5 వేల క్యూసెక్కుల మేర నీరు విడిచిపెట్టినట్టు అధికారులు సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ప్రకాశం బ్యారేజికి దిగువన ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు ఎగువన నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను కూడా ఎత్తినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.
**వరద నీటిని సద్వినియోగం చేయండి :** ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున తరలించి సోమశిల, కండలేరు ప్రాజెక్టులను నింపాలని సీఎం ఆదేశించారు. వరద నీటిని వృధాగా సముద్రంలోకి పోనీయకుండా సద్వినియోగం చేసుకునేలా సమర్ధ నీటి నిర్వహణ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మైలవరం సహా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం బుడమేరు, వెలగలేరులకు పెద్ద ఎత్తున వస్తోందని.. ఈ నీరు కృష్ణా నదిలోకి డిశ్చార్జి చేస్తున్నట్టు తెలిపారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు వివరించారు. వరద నిర్వహణా పనుల్లో భాగంగా రూ. 40 కోట్లతో బుడమేరు- వెలగలేరు యూటీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ముఖ్యమంత్రి అనుమతి మంజూరు చేశారు.



**గండ్లు పడకుండా గట్లు పటిష్ట పర్చాలి :** మరోవైపు భారీవర్షం కారణంగా కొండవీటి వాగు, పాల వాగులకు వస్తున్న నీటిని కృష్ణా నదిలోకి నాలుగు పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వం-షకాల సీజన్ లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా వెళ్లేందుకు వీలుగా గుర్రపు డెక్క, తూడును తొలగించాలని ముఖ్యమంత్రి జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్టం చేయాలని సీఎం సూచించారు. జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉండి రైతులకు తక్షణ సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో భూగర్భ జలాలను రీఛార్జి చేసేలా నిర్మాణాలను చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు ఆయా ట్రెంచ్ లను ఎక్కడెక్కడ చేపట్టాలో ప్రణాళిక చేసుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ట్రెంచ్ లను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

## లాభాపేక్ష లేకుండా క్యాన్సర్ ఆస్పత్రి



(మొదటి పేజీ తరువాయి)

దాతల సహకారంతో ఆసుపత్రి నడుస్తోంది. రోగులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు వచ్చాయి. అత్యుత్తమ క్యాన్సర్ ఆసుపత్రిగా దేశంలో మంచి పేరు తెచ్చుకుంది. అత్యాధునిక క్యాన్సర్ వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలని మా తల్లి బసవతారకం కోరిక. ఆమె కోరిక మేరకు అత్యున్నత వైద్యం అందిస్తున్నాం. అమరావతిలో క్యాన్సర్ ఆస్పత్రికి మొదటి విడతలో రూ. 750 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మొదటి విడత పనులు 2028 కల్లా పూర్తి చేసి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తాం” అని బాలకృష్ణ తెలిపారు.
**రెండు దశల్లో నిర్మాణం.. :** రాజధానిలో 21 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న క్యాన్సర్ కేర్ క్యాంపస్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధనతోపాటు.. రోగుల సంరక్షణకు ఎక్సలెన్సీ సెంటర్ అందుబాటులోకి తెస్తారు. తొలి దశలో 500 పడకల సామర్థ్యంతో విస్తృత శ్రేణి ఆంకాలజీ సేవలు అందిస్తారు. రూ. 750 కోట్ల పెట్టుబడితో మౌలిక సదుపాయాలు, అధునాతన పరికరాలు సమకూరుస్తారు. వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స తదితర ప్రక్రియలకు ఇంటిగ్రేటెడ్ కేర్ మోడల్‌తో ఏర్పాటుచేసి.. 2028 నాటికి శస్త్రచికిత్సలు ప్రారంభించాలని భావిస్తున్నారు. రెండో దశలో పడకల స్థాయి వెయ్యికి పెంచుతారు. ప్రత్యేక విభాగాలు, పరిశోధన విభాగాల ఏర్పాటు, క్లిష్టమైన, అధునాతన క్యాన్సర్ కేసులకు ప్రాంతీయ రిఫరల్ కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతారు.

## ఆక్వా యూనిట్లు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



(మొదటి పేజీ తరువాయి)

రైతుల సంక్షేమం, ఎగుమతుల ప్రోత్సాహం, కొత్త ఉపాధి అవకాశాల దిశగా రాష్ట్రానికి మైలురాయిగా నిలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు.
**అక్వాకల్చర్ లైసెన్స్ ప్రక్రియ సరళీకరణ :** రైతులు ఇకపై APSADA చట్టం కింద తమ ఆక్వా చెరువులను ఆన్లైన్లో సులభంగా నమోదు చేసుకోవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ విధానం ద్వారా లైసెన్స్ పొందే ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని అన్నారు. ప్రభుత్వ ప్రయోజన పథకాలు పొందడానికి ప్రతి అక్వాకల్చర్ రైతు తమ చెరువులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. సముద్ర ఆహార ఎగుమతుల నాణ్యతను, ట్రేసబిలిటీని మెరుగుపరచడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. డి-పట్టా, అసైన్, భూములపై చేపల పెంపకం చేస్తున్న రైతులకు APSADA చట్టం ప్రకారం సాగు ధ్రువీకరణ పత్రం ఇవ్వబడుతుందని తెలిపారు. దీని ద్వారా వారు ప్రభుత్వ పథకాలు మరియు ఆర్థిక సహాయం పొందే అవకాశం కలుగుతుందని తెలియజేశారు.
**పౌల్ట్రీ వ్యర్థాల వాడకం పై నిషేధం :** కొన్ని ప్రాంతాల్లో పౌల్ట్రీ వ్యర్థాలను చేపల ఆహారంగా వాడుతున్నట్లు గుర్తించామని మంత్రి అన్నారు. ఇది ప్రజారోగ్యానికి హానికరంతో పాటు నీటి కాలుష్యం కావడంతో ఈ ప్రక్రియను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రైతులు వెంటనే ఈ విధానాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. చెరువుల యజమానులు చికెన్ వ్యర్థాలను చేపల ఆహరంగా వేసినట్లు రుజువైతే వెంటనే వారి లైసెన్స్ లను రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
**అమెరికా టారిఫ్ల ప్రభావం తగ్గించడానికి చర్యలు :** 2025 ఆగస్టు 27 నుండి భారతీయ రొయ్య ఎగుమతులపై అమెరికా విధిస్తున్న 50% టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించేందుకు మంత్రి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. MPEDA సహకారంతో దక్షిణ కొరియా, యూరోప్, యూకే, మిడిల్ ఈస్ట్, రష్యా, ఆఫ్రికా వంటి కొత్త మార్కెట్లను అన్వేషించాలని సూచించారు. యూకేతో కుదిరిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. ఎగుమతిదారులు, ప్రాసెసర్లు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలన్నారు. ఆక్వా రైతులకు మేలు జరిగేలా అధిక సుంకాల వ్యవహారంపై సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ ని కంపెనీ చట్టం కింద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో FFPOలు మరియు అక్వాకల్చర్ రంగంలోని ఇతర వ్యాపారులు సభ్యులుగా ఉంటారు. దేశీయ వినియోగాన్ని పెంచడానికి ఇది NECC మోడల్ తరహాలో పనిచేస్తుంది.
ఈ సమావేశంలో APSADA కో-వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణా రెడ్డి, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయిక్, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో వర్ష బీభత్సం

- ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో నలుగురు మృతి, ఇద్దరు గల్లంతు
- పొంగిన కాలువలు, వాగులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- చేబ్రోలులో రికార్డు స్థాయిలో 272.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- వేలాది ఎకరాల్లో పంటలు నీట మునక



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. కాలువలు, వాగులు పొంగి ప్రవహించాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు జనజీవనం స్తంభించింది. ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. గుంటూరు జిల్లాలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గల్లంతయ్యారు. కృష్ణా జిల్లాలో 83.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చల్లపల్ల మండలంలో 117.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 50.10 మిల్లీమీటర్ల వం-షపాతం నమోదైంది. అత్యధికంగా ఇబ్రహీంపట్నం మండలంలో 142.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో బుడమేరు నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లు నీట మునిగాయి. గుణదల వంతెనపై నీరు ప్రవహిస్తోంది. కృష్ణా నది వరద ఉధృతితో ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన లంక గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు పర్యటించారు. వర్షాలకు నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు.

విజయవాడ వన్‌టౌన్ 53వ డివిజన్ దూది ఫ్యాక్టరీ వద్ద మ్యాన్‌హోల్‌లో పడి మెడికల్ షాపులో పనిచేస్తున్న టిడిపి డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ (46) మృతి చెరదారు. వించిపేటకు చెందిన గోల్డ్ షాపులో పాలిష్ పని చేస్తున్న ముత్తుజా (40) అనే కార్మికుడు ఇంటికి వెళ్తూ డ్రెయిన్లో పడి మరణించారు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేష్ అనే యువకుడు లయోల కళాశాల వద్ద వర్షానికి కూలిన చెట్టును ఢకొని మృతి చెందారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు వద్ద కాలువలో పడి ఎనిమిదో తరగతి విద్యార్థి నెలపాటి భరత్ (12) మరణించారు. తుళ్లూరు మండలం రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెం వద్ద కృష్ణా నదిలో తెనాలికి సమీపంలోని పెదపాలేనికి చెందిన అన్నదమ్ములు పసంగి వీర ఉపేంద్ర (22), పసంగి కామేశ్వరరావు (19) గల్లంతయ్యారు. వీరిద్దరూ ఉద్దండరాయునిపాలెం ఇసుక రేవు వద్ద పనిచేస్తున్నారు.

**రాజధాని అమరావతికి నిలిచిన రాకపోకలు :** గుంటూరు-తుళ్లూరు మార్గంలోని వాగులు పొంగడంతో రాజధాని అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి నుంచి వెలగపూడి వెళ్లేందుకు కూడా కృష్ణా నది వరదతో రాకపోకలు స్తంభించాయి. మంగళగిరి, విజయవాడ మార్గంలో మాత్రమే సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో, 50 శాతానికిపైగా ఉద్యోగులు సకాలంలో చేరుకోలేకపోయారు. హైకోర్టు మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు జిల్లాలో రికార్డు స్థాయిలో చేబ్రోలు మండలంలో 272.4 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా పెదకూరపాడులో అత్యధికంగా 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని వద్ద ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. కాజా టోల్ గేట్ వద్ద వర్షపు నీరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు రెండు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. నాగార్జున విశ్వవిద్యాలయంలో వర్షం నీరు భారీగా చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హాస్టళ్ల పైఅంతస్తుల్లోకి నిచ్చెనలు, తాళ్ల సహాయంతో వెళ్లాల్సి వస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, తాడేపల్లిలో కుండపోత వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యాయి. పెనుమంట్ర, మొగల్తూరు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఏలూరు నగరంలో రోడ్లు జలమయయ్యాయి. ముదినేపల్లి, ద్వారకాతిరుమల, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. కాకినాడ జిల్లాలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, పోలీసు స్టేషన్లోలోకి మోకాల్లోతు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. జాతీయ రహదారి 216పై ప్రభుత్వ కార్యాలయాల ఎదుట భారీ వృక్షం నేల కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వర్షాలకు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు వద్ద కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలం శివభాష్యం వరదరాజుల స్వామి గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో పలుచోట్ల వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

**నేడు ప్రకాశం బ్యారేజీకి ఐదు లక్షల క్యూసెక్కుల ప్రవాహం! :** ప్రకాశం బ్యారేజీకి వరద పోటు మరింత పెరిగింది. నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌కు 2.30 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 2.71 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో, పులిచింతలకు వరద పోటు పెరిగింది. 3.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 3.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నీటితోపాటు ఖమ్మం, కృష్ణా జిల్లాల పరిధిలోని వరద ప్రవాహం కూడా ప్రకాశం బ్యారేజీని చేరుతోంది. గురువారం ఉదయానికి ఐదు లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**నిండుకుండలా 'శ్రీశైలం' -ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల :** ఎగువ ప్రాంతాల నుండి వరద ఉధృతితో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. మొత్తం ఏడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,89,133 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ జూరాల నుండి 90,980 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 42,669 క్యూసెక్కులు, హంద్రి నుండి 3,750 క్యూసెక్కులతో జలాశయానికి 1,37,399 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నుండి 39,443 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 16.820 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం నుండి 30,596 క్యూసెక్కుల నీటితో 15.210 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 32 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల ప్రవంతికి 2,818 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 546 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 882.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 202.050 నమోదైంది. దిగువ నాగార్జునసాగర్‌కు ఏడు గేట్ల ద్వారా, రెండు విద్యుత్ కేంద్రాల నుండి 2,54,784 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**నేడు ఎన్‌టిఆర్ జిల్లాలో పాఠశాలలకు సెలవు :** ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా సెలవు గురువారం ప్రకటించారు. భారీ వర్షాలు, వరదల ఉధృతి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

## భారీ వర్షాలపై వదంతులు నమ్మొద్దు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఒక వైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులోభాగంగా బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అల్పపీడన ప్రభావంతో రేపు.. అంటే గురువారం కోస్తా జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అలాగే క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ అధికారులకు సూచించారు. వర్ష ప్రభావ ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక వేళ.. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగానికి ఆమె కీలక సూచనలు చేశారు.

ఇక సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. అయితే ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్స్, నెలకూలిన వృక్షాలను వెంటనే తొలగించాలని వారికి సూచించారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3,19,133 క్యూసెక్కులుగా ఉందని వివరించారు. వరద ప్రవాహం కారణంగా.. మొదటి ప్రమాద హెచ్చరిక వరకు నీరు చేరే అవకాశం ఉందన్నారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక ప్రమాద ప్రాంతాల్లో తప్పని సరిగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలని సూచించారు. హోర్డింగ్స్, శిధిలావస్థలో ఉన్న భవనాలు, గోడలు, చెట్ల వద్ద ఉండరాదని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి అనిత సూచించారు. మరోవైపు భారీ వర్షాలు, అల్ప పీడనం ఏర్పడిన వేళ.. సోషల్ మీడియాలోని వదంతులను నమ్మవద్దంటూ ప్రజలకు ఆమె కీలక సూచన చేశారు. చాలా అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి. జయలక్ష్మీ, డైరెక్టర్ ప్రఖర్ జైన్, కోస్తా జిల్లాల కలెక్టర్లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు సక్సెస్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమం ఘనవిజయం సాధించిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 40 రోజుల్లో 1.08 లక్షల మంది కార్యకర్తల ద్వారా కోటి 20 లక్షల ఇళ్లను సందర్శించి ప్రజలకు ఏడాది పాలనలో కలిగిన లబ్ధి, అభిప్రాయాలను తెలుసుకున్నామని తెలిపారు. ప్రజలు ప్రశాంత పాలన సాగుతోందని సంతోషం వ్యక్తం చేశారని, వాలంటీర్ల దౌర్జన్యాలు, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనలు గత ప్రభుత్వంలోనే జరిగాయని అన్నారు. ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉందని ప్రజలు స్పష్టంచేశారని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షించడంతో కార్యకర్తల పనితీరును సమర్థవంతంగా అంచనా వేసినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 70% ఇప్పటికే అమలయ్యాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభంతో ఇది 90% దాటుతుందని చెప్పారు. పెన్షన్‌ను రూ. 1,000 పెంచి ప్రతినెల ఒకటో తేదీన పంపిణీ చేయడం ప్రజల సంతోషానికి కారణమైందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమంపై మాత్రమే దృష్టిపెట్టి అభివృద్ధిని విస్మరించిందని, కానీ తమ ప్రభుత్వం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. విదేశీ పర్యటనల ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. పార్టీ కష్టకాలంలో నిలిచిన వారికి ఏఎంసీలు, దేవాలయ కమిటీల్లో పదవులు కల్పించామని, ఇది సిఫార్సుల ఆధారంగా కాకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారిని గుర్తించడమేనని స్పష్టం చేశారు. పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మరణించిన 400 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు అందజేశామని తెలిపారు.

ప్రతి ఎమ్మెల్యే శుక్ర, శనివారాల్లో నియోజకవర్గంలో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారని, వచ్చిన ఫిర్యాదులను పీజీఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గత 10 నెలల్లో వచ్చిన 6 లక్షల ఫిర్యాదుల్లో అధిక భాగం రెవెన్యూ సంబంధితవేనని, నారా లోకేష్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని వివరించారు. ఈ ఏడాది సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 400 కోట్లు విడుదల చేశామని, గత ప్రభుత్వంలో ఇది రూ. 50 కోట్లు కూడా దాటలేదని విమర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.

## పని విధానాలకు అంగీకరిస్తే వేతనాల పెంపునకు సుముఖం: దిల్‌రాజు

**హైదరాబాద్:** సినీకార్మికుల వేతనాల పెంపు అంశం ఇంకా కొలిక్కి రాలేదని నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, మరో రెండు, మూడు సార్లు చర్చలు జరగాల్సి ఉందన్నారు. పని విధానాలకు అంగీకరిస్తే వేతనాలు పెంచేందుకు నిర్మాతలు సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. "వేతనాలు పెంచాలని గత కొద్దిరోజులుగా ఫెడరేషన్ వాళ్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, నిర్మాతల నుంచి కొన్ని షరతులు ఉన్నాయి. ముఖ్యంగా 2018, 2022లలో జరిగిన అగ్రిమెంట్స్‌లో ఉన్న రెండు షరతులను వాళ్లు అమలు చేయడం లేదు. ముందు వాటిని ఒప్పుకోవాలి. వీటితో పాటు మరో రెండు షరతులు కూడా ఉన్నాయి. ఇదే విషయాన్ని ఛాంబర్ ద్వారా వాళ్ల దృష్టికి తీసుకొచ్చాం. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే, వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నాం. రూ. 2వేలు కన్నా తక్కువ వేతనం తీసుకునే వారికి ఒక పర్సంటేజీ ఆఫర్ చేస్తున్నాం. దాని కన్నా ఎక్కువ వేతనం తీసుకునే వాళ్లకు మరొక పర్సంటేజీ ఇవ్వాలని ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్‌లతో మాట్లాడుకుని వస్తే, దీనిని పరిష్కరిస్తాం. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో అన్ని అంశాలను చర్చించాం. ప్రస్తుతం సానుకూల ధోరణిలో చర్చలు జరుగుతున్నాయి" అని దిల్‌రాజు తెలిపారు.

# గుంటూరులో సందడిగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య వజ్రోత్సవాల ఉత్సాహంలో భాగంగా బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ సోమవారం నగరంలో సందడి చేసింది. బ్రాడీపేట నుంచి శంకర్ విలాస్ వరకు నాయకులు, కార్యకర్తలు జాతీయ పతాకాలను చేతబూని "హర్ ఘర్ తిరంగా", "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో ఊరేగారు. ఈ సందర్భంగా వీధులంతా దేశభక్తి నినాదాలతో మారుమ్రోగాయి. కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశ ఐక్యత ప్రతీక అయిన జాతీయ పతాకాన్ని ప్రతి ఇంటిమీద ఎగురవేయాలని పిలుపునిచ్చారు. తిరంగా గౌరవం, దేశభక్తి ఉత్సాహం పెంపొందించేందుకు పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రపరచడం, వారి చిత్రపటాలకు పూలమాలలు సమర్పించడం, వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలను పరామర్శించాలనే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు పార్టీ శ్రేణులు కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లపై జెండా ఆవిష్కరించి సెల్ఫీలు తీయాలని సూచించారు.

వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని, ప్రతి భారతీయుడు జాతీయ పతాకాన్ని గౌరవించాలన్నారు. జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు నివాళులు అర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలని, రాబోయే వందో స్వాతంత్ర్య దినోత్సవం నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా నడుస్తోందని, ఓటమి వచ్చిన ప్రతిసారీ ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు ప్రజలు నమ్మబోరన్నారు.

ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా కోస్తాంధ్ర ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, కార్యదర్శులు నారాయణ రెడ్డి, టివి రావు, దర్శనం శ్రీనివాస్, వెలగలేటి గంగాధర్, రాజేష్ నాయుడు, రాచుమల్లు భాస్కర్, ఈమని మాధవరెడ్డి, అప్పిశెట్టి రంగా, దుర్గాప్రసాదు, తుంగ యశ్వంత్, మైలవరపు ప్రవీణ్, రషీద్, అనిల్, శశాంక్, ఆళ్ల దాసు, రాము, చక్రి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో గెస్ట్‌హౌస్‌ల పేరిట నకిలీ వెబ్‌సైట్లు.. వాటిని నమ్మొద్దు: పోలీసులు



**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల శ్రీవారి భక్తులే లక్ష్యంగా సైబర్ మోసాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శనం, వసతుల పేరిట ఇంటర్నెట్‌లో నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. వాటిని నివారించడానికి తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుమల పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా శ్రీవారి దర్శనం, తిరుమలలో వసతులు కల్పిస్తామంటూ ఇంటర్నెట్‌లో 30కిపైగా నకిలీ వెబ్‌సైట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాటిని సెర్చ్ ఇంజిన్ నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటి వరకు 28 నకిలీ వెబ్‌సైట్లను తొలగించినట్లు తెలిపారు.

భక్తులు ఎవరైనా తిరుమలలో వసతుల కోసం ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసినప్పుడు.. సప్తగిరి గెస్ట్‌హౌస్, నందకం గెస్ట్‌హౌస్, పద్మావతి గెస్ట్‌హౌస్.. ఇలా కొన్ని గెస్ట్‌హౌస్‌ల పేరుతో వెబ్‌సైట్లు కనిపిస్తే అవి నకిలీవిగా గుర్తించాలని పోలీసులు సూచించారు. శ్రీవారి దర్శనం, వసతులు, సేవల కోసం తితిదే అధికారిక వెబ్‌సైట్ https://www.tirumala.orgను మాత్రమే సందర్శించాలని చెప్పారు. వాట్సప్ కాల్, క్యూఆర్ కోడ్ పంపించి పేమెంట్ చేయాలని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చేయొద్దన్నారు. ఇలాంటివి అనుమానాస్పదంగా కనిపిస్తే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్/100/టోల్ ఫ్రీ నంబర్ 18004254141ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## భారత పౌరసత్వం రాకముందే ఓటరు జాబితాలో సోనియా పేరు చేర్చారు: బీజేపీ నేత మాలవీయ

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తూ ఓట్లను తొలగిస్తోందని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఆమెకు భారత పౌరసత్వం లభించక ముందే, ఢిల్లీ ఓటర్ల జాబితాలో ఆమె పేరు నమోదైందని ఆరోపించింది. ఈ మేరకు బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ సోషల్ మీడియా వేదికగా కొన్ని ఆధారాలను బయటపెట్టడం జాతీయ రాజకీయాల్లో కలకలం రేపుతోంది.

బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. 1980 నాటి ఢిల్లీ ఓటర్ల జాబితాకు సంబంధించిన ఒక చిత్రాన్ని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ జాబితాలో సోనియా గాంధీ పేరు స్పష్టంగా ఉందని, ఒక విదేశీ పౌరురాలికి ఇది ఎలా సాధ్యమైందని ఆయన ప్రశ్నించారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, తీవ్రమైన తప్పిదమని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి, ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని అధికారికంగా స్వీకరించారు. అయితే, పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే, అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేరడంపై మాలవీయ సందేహాలు వ్యక్తం చేశారు. "ఒక ఇటలీ పౌరురాలి పేరును భారత ఓటర్ల జాబితాలో ఎలా చేర్చారు? అప్పటి ప్రభుత్వం ఒత్తిడితో ఇది జరిగిందా? లేక గాంధీ కుటుంబం మోసపూరితంగా ఈ పని చేసిందా?" అని మాలవీయ వరుస ప్రశ్నలు సంధించారు. ఈ మొత్తం వ్యవహారంపై గాంధీ కుటుంబంతో పాటు, నాటి ఎన్నికల సంఘం అధికారులు కూడా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కొత్త ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడగా, దీనిపై ఆ పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# అవయవ దానంపై అవగాహన ర్యాలీ




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ అవయవ దానం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం, అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం సహకారంతో అవయవ దాన ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి మిద్దె సెంటర్ మీదుగా సీకే జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వీజే డిగ్రీ కళాశాల విద్యార్థులు, నిర్మల హై స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. తొలుత ర్యాలీని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ ఎస్ వి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ ఎస్ ఎస్ వి మాట్లాడుతూ... సమాజంలో అవయవ దానంపై ప్రజలకు చాలా అనుమానాలు, భయాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడానికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలన్నారు. అవయవదానం చేసిన కుటుంబాలను ప్రభుత్వాలు గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ... దానాలలో కెల్లా అవయవ దానం ఎంతో గొప్పదని, మనుషుల ప్రాణాలను నిలిపే ఈ ప్రయత్నం ఎంతో విశిష్టమైనదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మలా ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి పాముల రెడ్డి, ఫార్మకాలజీ అండ్ ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ ఫైజాన్ అలీ, నిర్మల ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పి తేజ శృతి, వి జోజిబాబు, బి. అలేఖ్య , మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, బుద్ధ విహార అధ్యక్షుడు రేఖా కృష్ణార్జునరావు, కంచర్ల కాశయ్య, పొట్లాబత్తుని లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేఖా నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్.. రూ.50వేల లిమిట్‌పై వెనక్కి




**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంక్ ఐసీఐసీఐ యూటర్న్ తీసుకుంది. రూ. 50వేల కనీసం బ్యాలెన్స్ ఉండాలన్న నిబంధనపై వెనక్కి తగ్గింది. ఇటీవలి నిర్ణయంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో తన నిర్ణయం మార్చుకుంది. ఈ మేరకు కనీస సగటు బ్యాలెన్స్ మొత్తాలను సవరించింది. మెట్రో/అర్బన్ ఖాతాదారులు రూ. 15,000 నెలవారీ సగటు బ్యాలెన్స్ కలిగి ఉండాలని పేర్కొంది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో అయితే రూ. 7,500 ఉండాలన్న నిబంధన విధించింది. గ్రామీణ ఖాతాదారులకు మాత్రం ఎప్పటిలానే రూ. 2,500 సగటు మినిమమ్ బ్యాలెన్స్ ఉంచితే సరిపోతుందని పేర్కొంది.

పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ప్రభుత్వరంగ బ్యాంకులు పూర్తిగా ఎత్తివేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు ఇటీవల షాకిచ్చిన విషయం తెలిసిందే. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2025 ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే వర్తిస్తుందని స్పష్టంచేసింది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్ల కనీస నిల్వ పరిమితిని రూ. 50 వేలకు పెంచేసింది. గతంలో ఈ మొత్తం రూ. 10 వేలుగా ఉండేది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ. 5 వేల నుంచి రూ. 25 వేలకు పెంచింది. గ్రామీణ ఖాతాదార్లకు రూ. 2,500 నుంచి రూ. 10 వేలకు సవరించింది. దీనిపై ఆర్‌బీఐ జోక్యం చేసుకోనప్పటికీ.. పౌరుల నుంచి మాత్రం పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ మొత్తాలను స్వల్పంగా సవరిస్తూ తాజా నిర్ణయం తీసుకుంది.

# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి

**అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి ..**

**అడవిజంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారం**

**అధికారుల ప్రమోషన్లు.. అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి**

**అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ**



**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సిఎం సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఇందుకు సీఎంఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యా వరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు.

సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మెయింటనెన్స్ డిపోను తనిఖీ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## రైల్వే మెయింటెనెన్స్ డిపో తనిఖీ

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం మౌలాలీలోని ట్రెన్ సెట్ మెయింటెనెన్స్ డిపోను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ డిపోలో చేపడుతున్న వందే భారత్ రైళ్లు, ఎం.ఎం.టి.ఎస్, ఈ.ఎం.యూ ల తనిఖీ,నిర్వహణ షెడ్యూల్‌లను సమీక్షించారు.అదేవిదంగా ఆయన వందే భారత్ రైలును క్షుణ్ణంగా తనిఖీ చేసి, కొనసాగుతున్న నిర్వహణ కార్యకలాపాలను నిశితంగా సమీక్షించారు. డిపోలోని ఇతర సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు. వాటిలో పిట్ వీల్ లేత్, ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్ లను తనిఖీ చేసి కార్యాచరణ సామర్థ్యాన్ని అంచనా వేశారు. అనం తరం జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందితో సంభాషించారు. భద్రత, సామర్థ్యం అధిక ప్రమాణాలను నిర్వహించాలని వారికి సూచించారు. జనరల్ మేనేజర్ పర్యావరణ హిత వాతావరణాన్ని ప్రోత్సహించడానికి మొక్కలు నాటారు. అధికారులతో తదుపరి అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.

## బిసిలకు క్షమాపణ చెప్పి బిఆర్ఎస్ సభ పెట్టాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** బీసిలకు క్షమాపణ చెప్పి బీఆర్ఎస్ నేతలు సభ నిర్వహించుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విలీనం కోసం బిజెపితో లోపాయి కారీ ఒప్పదం పెట్టుకొని డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రజా సమస్యల కోసం వేదికలు ఉండేవి కావని, పదేళ్ల పాలనలో గడిల పాలన, ఫాం హౌస్ పాలనకి చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని అన్నారు. బీఆర్ఎస్ హాయంలో ప్రగతి భవన్‌లోకి సామాన్యుడికి ప్రవేశం లేదని, ధనవంతులకే ఖరీదైనకార్లలో ఎంట్రీ ఉండేదన్నారు. ప్రజల సమస్యల కోసం అందు బాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గాంధీభవన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారిందని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం బిసిలను పట్టించుకున్న పాపాన పోలేద న్నారు. కుల గణనలో కెసిఆర్ కుటుంబం పాల్గొనలేదు. బిసి సభ పెట్టడా నికి బీఆర్ఎస్ నేతలకు ఏం అర్హత ఉందన్నారు. బిసి సభ కోసం ఫాంహౌస్‌లో వినోద్, కెసిఆర్, హరీశ్‌రావుతో కెసిఆర్ చర్చలు జరపడం విడ్డూరంగా ఉందన్నారు.



బిసిల యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

## పార్టీపరంగా 42శాతం టిక్కెట్లు అంటే ఒప్పుకోం

### హక్కుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** బీసీ బిల్లుల అమలు కోసం ప్రజా పోరాటంతోపాటు అవసరమైతే న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉందని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎల్.శ్రావణి. తంగెళ్లమూడి నందగోపాల్‌తో కలిసి బీసీల యుద్ధభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయ, చట్టపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగా వుందన్నారు. పార్టీ పరంగా 42శాతం టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, చట్టపరంగా హక్కుగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 31న నగరంలోని రవీంద్రభారతిలో బిసిల యుద్ధబేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి, శ్రావణి, పి.సుధాకర్, చెరుకు మణికంఠ, కరుణ, కవిత, పగిళ్ల సతీష్, హరి, తిలక్ సింగ్, శివ, చాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్‌లో హైటెన్షన్

**పెద్దమ్మగుడిలో కుంకుమార్చనకు బిజెపి నేతలు పిలుపు**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హౌజ్ అరెస్టు**

**అరెస్టును ఖండించిన బిజెపి నేతలు**



**హైదరాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావును పోలీ సులు గృహ నిర్బంధనం చేశారు. దీంతో మంగళవారం బంజారాహిల్స్‌లో హైటెన్షన్ నెలకొంది. రోడ్‌నెంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన పూజ నిర్వహించాలని బిజెపి, హిందు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీ సులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే ఇన్ని దారులను మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా పెద్దమ్మ ఆలయం దగ్గర భారీగాపోలీసులు మోహరించారు. గత కొద్ది రోజుల క్రితం దుండగులు ఈ ఆల యాన్ని ధ్వంసం చేయడంతో వివాదం నెలకొంది. మరోవైపు నగర వ్యాప్తంగా బిజెపి లీడర్లు, హిందూ సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పె ద్దమ్మ గుడికి వెళ్తారన్న సమా చారం ఉండ డంతో ఆయన్ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తా ర్నాకలోని ఆయన నివాసం లోనే గృహ నిర్బం ధం చేశారు. అయి తే పోలీసుల తీరుపై బిజెపి నేతలు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్బంధ చర్యలు పనికిరావని హెచ్చరించారు.

**గుడిని కూల్చిన గూండాలను అరెస్ట్ చేయరెందుకు?: కేంద్ర మంత్రి బండి సంజయ్**

బంజారాహిల్స్ పెద్దమ్మ గుడివద్ద హిందూ సంఘాలు నిర్వహించే కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లే కార్యక్రమం లేకపోకపోయినా రామ చందర్ రావును అడ్డుకోవడంపైనా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయం తెలిసిన వెంటనే తీవ్రంగా స్పందించారు. పెద్దమ్మ గుడికి హిందువులు పోతే తప్పేంది? రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? భాగ్యనగర్ లో హిందూ సంఘాలను, బిజెపి కార్యకర్తలందరినీ అరెస్ట్ చేయడం మూర్ఖత్వం అని పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారమే కాంగ్రెస్ వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తోందన్నారు. పెద్దమ్మ గుడిని కూల్చిన గూండాలను అరెస్ట్ చేయకుండా శాంతియుతంగా పూజలు నిర్వహించే హిందూ సంఘాల నాయ కులను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇట్లాంటి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. రాంచందర్‌రావు అరెస్టును మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌విఎస్ఎస్ ప్రభా కర్, గువ్వల బాలరాజు ఖండించారు. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడడం దురదృష్టకరమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హర్ ఘర్ తిరంగా యాత్ర రాష్ట్ర ప్రముఖ్ డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. బిజెపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు, నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు.

## వికారాబాద్ కలెక్టరేట్‌లో ఎసిబి సోదాలు

### రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మహిళా ఉద్యోగి

**వికారాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎసిబి సోదాలు జరగడం తీవ్రకలకలం రేపింది. ఓ మహిళా ఉద్యోగి లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కారు. వికారాబాద్ జిల్లా కలెక్ట రేట్‌లోని రెవెన్యూ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్ సుజాత రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కింది. ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం వట్టిమీనపల్లికి చెందిన ఓ రైతు రెండెకరాల అసైన్డ్ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జాకు యత్నించాడు. బాధితుడు నవాబుపేట తహసీల్దార్‌ను ఆశ్రయించగా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డర్ కాపీ తీసుకురావాలన్నారు. అందుకోసం రెవె న్యూ సెక్షన్‌లోని జూనియర్ అసిస్టెంట్ సుజాతకు బాధితుడు రూ.5 వేలు ఆన్లైన్ పేమెంట్ చేశాడు. ఆర్డర్ కాపీని మళ్లీ నవాబుపేట్ తహసీల్దార్ కార్యాలయానికి పంపాలంటే మరో రూ.20 వేలు ఇవ్వాలనడంతో రూ.15 వేలు ఇస్తానని బాధితుడు బేరం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత బాధితుడు ఎసిబి అధికారుల ను ఆశ్రయించి వారి సూచన మేరకు మంగళవారం జూనియర్ అసిస్టెంట్ సుజాతకు రూ.15 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టు నకున్నారు. నిందితురాలిని విచారిస్తున్నామని, ఆ తర్వాత ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.



లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన జూనియర్ అసిస్టెంట్ సుజాత

**ఆన్‌లైన్ లంచం.. పట్టుబడ్డ సర్వేయర్**

**పెద్దపల్లి.(జర్నలిస్ట్‌ఫైల్):** నగదు రూపంలో లంచం తీసుకుంటే దొరికిపోతానని, డిజిటల్ మార్గంలో లంచం తీసుకున్న ఓ అధికారిని ఎసిబి అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పెద్దపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న సునీల్ ఓ బాధితుని వద్ద ఫోన్‌పే ద్వారా తీసుకోగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. బాధితుడు తన భూమి సర్వే కోసం 8 నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా సర్వే రిపోర్ట్ కోసం సర్వేయర్ రూ.20వేల లంచండం డిమాండ్ చేశారు. బాధితుడు రూ.10 వేలు ఫోన్‌పే ద్వారా, ఓ ప్రైవేట్ వ్యక్తి సర్వేయర్ ద్వారా ఫోన్‌పే చేయించుకుని సర్వే చెయ్యకపోవడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ప్రైవేట్ సర్వేయర్ రాజేందర్ రెడ్డి నుండి 10 వేల రూపాయలు జూలై 9న ఫోన్‌పే చేయించుకున్నారు. దీంతో కాల్ రికార్డింగ్స్, ఫోన్ పే ట్రాన్స్ సాక్షన్స్ ఆధారంగా సర్వేయర్ సునీల్, ప్రైవేట్ సర్వేయర్ ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిబి డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

## 'కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి పెట్టుకోండి'

### బిజెపిలో చేరుతున్న వారికి రాజాసింగ్ హెచ్చరికలు




కొన్ని మాటలు యాది పెట్టుకోండి, రాసి కూడా పెట్టుకోండి.

**హైదరాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** బిజెపిలో చేరుతున్న వారికి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతం సుస్వాగతం.. పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి కూడా పెట్టుకోండి అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పార్టీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీ, మీ జిల్లా, మీ పార్లమెంటరీ నియోజకవర్గంలో జర గదని చెప్పారు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత మీరు వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరని పేర్కొన్నారు. బీజేపీలో చేరేముందు కొంత మందితో చర్చలు చేసుకొని రండి అని రాజా సింగ్ సూచనలు చేశారు. ఇటీవల రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వెయ్యనివ్వలేని కారణంగానే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

"బీజేపీలో వేరే పార్టీ నుంచి చాలామంది చేరుతున్నారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతం సుస్వాగతం. బీజేపీలో చేరే ముందు బీజేపీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీలో, మీ జిల్లాలో, మీ పార్లమెంటరీ నియోజక వర్గంలో జరగదు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరు. ఎన్నికల ముందు మీకే టికెట్ వస్తదని గ్యారెంటీ కూడా ఉండదు. బీజేపీలో ఈ రోజు మీరు చేరుంటారు కదా. మొదట్లో ఫస్ట్ సీట్లో మీరు ఉంటారు కానీ తర్వాత లాస్ట్ సీట్లో ఉంటారు. బీజేపీలో చేరిన తర్వాత కొన్ని అలవాట్లు మీరు చేసుకోవాలి. కొన్ని బాధలు కూడా భరించే శక్తి కూడా మీలో పెంచుకోవాలి" అని ఎమ్మెల్యే రాజా సింగ్ అన్నారు.

'మా అసెంబ్లీలో 11 యేళ్లుగా వారి అణచివేతను ఎదుర్కొంటున్నాము. మా జిల్లా, డివిజన్, నియోజకవర్గంలో వాళ్ల వ్యక్తి ఉంటాడు. మేము కోరుకున్నా మమ్మల్ని మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన మా కార్యకర్తల కోసం ఏమీ చేయలేకపోయాము. గోషామహల్ అసెంబ్లీ నుంచి బిజెపిలో చేరే ముందు కొంతమందితో మీరు మాట్లాడి.. చేరిన తర్వాత ఏమైతదని కనుక్కోండి. విజయ శాంతి, జితేందర్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి.. చాలామంది వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన తర్వాత ఎందుకు వెళ్లిపోయారో కనుక్కోండి. నా పర్సనల్ విజ్ఞప్తి ఏంటంటే?.. అలాంటి వారితో ఒక్కసారి మాట్లాడండి. హిందూత్వానికి, దేశా నికి, సమాజానికి చాలా మంచిపనులు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ. కానీ తెలంగాణలో బీజేపీ కొందరి వల్ల సర్వనాశనం అవుతోంది. బీజేపీలో మేము ఏది చెప్తే అదే అయితది, మేము ఏది రాస్తే అదే రాజ్యమైతది అనుకునే వ్యక్తుల వల్లనే పార్టీ సర్వనాశనం అవుతుంది. ఈరోజు కాకపోతే రేపు తెలంగాణలో రాక్షసులు నాశనమవుతారు. కార్యకర్తల ఆశీస్సులతో బీజేపీ తెలంగాణను పాలి స్తుంది. తెలంగాణలో సీఎం బీజేపీ నుంచే వస్తారు' అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, షఫీ, మల్లికార్జున్ తదితరులు

## దివ్యాంగుల పెన్షన్ ఆరు వేలకు పెంచి తీరుతాం

### లేకుంటే నేనే రాజీనామా చేస్తా

### రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

**హైదరాబాద్, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలు కచ్చితంగా పెంచుతామని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థానిక సంస్థల్లో దివ్యాంగుల రిజర్వేషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో 'దివ్యాంగుల హక్కులు సంక్షేమం, రాజకీయ అవకాశాలు' పై రాష్ట్ర సదస్సు జరిగింది. చైర్మన్ వీరయ్య ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచకొంటే తాను పదవికి రాజీనామా చేస్తానని...కేంద్రం రూ.3వేలకు పెన్షన్ పెంచకొంటే తమరు పార్టీ పదవికి రాజీనామా చేసే దమ్ముందా అని బిజెపి నేతలకు సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం పైబడి అంగవైకల్యం ఉంటేనే దివ్యాంగులుగా గుర్తిం చి, 20 వేల మందికి నెలకు రూ.300 చొప్పున పెన్షన్ ఇస్తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం 40శాతం పైబడి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు నెలకు రూ.4,016 పెన్షన్ ఇస్తున్నదని తెలిపారు. సమావేశంలో కమిటీ చైర్మన్ షఫీ, వైస్ చైర్మన్ ధ్యనంపల్లిమల్లికార్జున్, ఎన్పీఆర్‌డి ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు తుడుం రాజేందర్‌తోపాటు వివిధ జిల్లాల నుంచి 150 మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

# సినీఫక్కీలో జ్యుయెలరీ దుకాణం దోపిడి

**తుపాకీతో కాల్పులు జరిపి ఆభరణాలు చోరీ**

**పట్టపగలు పది నిమిషాలు బీభత్సం**

**హైదరాబాద్ చందానగర్‌లో దోపిడీదొంగల స్వైరవిహారం**



వెండి ఆభరణాలు దోచుకుంటున్న దృశ్యం

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి, శేరిలింగంపల్లి) ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):** పట్టపగలు సినీఫక్కీలో తుపాకీ ఎక్కుపెట్టి దోపిడీ దొంగలు పదినిమిషాలపాటు బీభత్సం సృష్టించారు. ప్రతినిత్యం లక్షలాది వాహనాలు తిరుగాడే జాతీయ రహదారిని ఆనుకొనివున్న జ్యూయెలరీ షాపులో చొరబడి అందినకాడికి దోచుకున్నారు. అడ్డొచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురి చేశారు. భయంతో వణికిపోయిన సిబ్బంది ఒక్కసారిగా పరుగులు తీయగా తమ పని ముగించుకొని నింపాదిగా వెళ్లిపోయారు. సైబరాబాద్ పరిధిలోని చందానగర్ ఖజానా జ్యూయెలరీలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా వున్నాయి. చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఖజానా జ్యూవెలరీ షాపులో మంగళవారం ఉదయం ఆరుగురు దొంగలు అకస్మికంగా చొరబడ్డారు. ఉదయం 10:35 నిముషాలకు అప్పుడే షాపు ఓపెన్‌చేసి ప్లెడ్జ్ చేస్తున్న సిబ్బందిపైకి ఒక్కసారిగా దూసుకువచ్చిన ఆరుగురు దుండగులు రెండు రౌండ్ల కాల్పులు జరిగపారు. తుపాకీ పేల్చి సీసీ కెమారాలను ధ్వంసం చేశారు. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు సిబ్బందిని లాకర్ కీ అడిగారు వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. కాగా జ్యూవెలరీ షాపు లోపల బంగారు అభరణాలకు సంబం ధించిన స్టాల్ స విరగగొట్టి సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు.

**పది నిమిషాల్లో పని ముగించారు..**

ఖజానా జ్యుయెలరీలో సినీఫక్కిలో సాగిన దోపిడీ అంతా పదినిముషాల్లోనే జరిగిపోయింది. సరిగ్గా ఉదయం 10:35 నిముషాలకు ఖజానా జ్యూవెలరీ షాపులోకి ప్రవేశించిన ఆరుగురు దుండగులు ముఖానికి మాస్కులు ధరించి ఒక్కొక్కరుగా లోపలికి చేరుకున్నారు. ముందుగా ఇద్దరు దుండగులు లోనికి ప్రవేశించారు. ఆ తరువాత ఇద్దరు దుండగులు చేతిలో తుపాకిలతో ప్రత్యక్ష్యమయ్యారు. ఆ తరువాత మరో ఇద్దరు దుండగులు ఒక్కొక్కరుగా మాస్కులతో షాపులోనికి వచ్చారు. దుండగులు సిబ్బందిపై తుపాకీ ఎక్కుపెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. సీసీ కెమారాలను ధ్వంసం చేయటంతో పాటు అసిస్టెంట్ మేనేజర్ సతీశ్‌ను బంగారు అభరణాలను భద్రపరచిన లాకర్ కీ ఇవ్వాలని బెదరించారు. అందుకు సతీశ్‌కుమార్ నిరాకరించటంతో అతనిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలోనే సతీశ్ కాలులోనికి బుల్లెట్ దూసుకుపోయింది. ఈ క్రమంలో పోలీసులు వస్తున్నారని గమనించిన దుండగులు అందిన కాడికి వెండివస్తువులను,కొన్ని బంగారు అభరణాలను దొంగలించుకొని దర్జాగా వెళ్లిపోయారు.

**ఆ సమయంలోనైతేనే..**

కాగా నిత్యం రద్దీగా ఉండే చందానగర్, గంగారం ప్రాంతంలో బంగారు ఆభరణాల షాపులు కొత్తగా వెలిశాయి. ముఖ్యంగా ఖజానా, మల్‌బార్, జీఆర్‌టీ, ఆర్ఎస్ బ్రదర్స్ వంటివి ఇక్కడేవున్నాయి. కాగా ఖజానా జ్యుయె లరీ షాపులో దోపిడీకి దుండగులు ముందుగానే రెక్కీ నిర్వహించి, పథకం ప్రకారంగానే ఉదయం వేళను ఎంచుకున్నట్లు తెలుస్తుంది. సిబ్బంది దుకాణం తెరవగానే కస్టమర్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం లేదనుకొని ఆ సమయాన్ని ఎంచుకన్నట్లు తెలుస్తుంది. అప్పటికీ ఆ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉండే అవకాశం కూడా ఉండదని పకడ్బందీగా తమ పథకాన్ని అమలు చేశారు.

**పది ప్రత్యేక బృందాల ఏర్పాటు: సిపి అవినాష్ మహంతి**

ఖజానా జ్యూయెలరీ బంగారం షాప్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ అవి నాష్ మహంతి తెలిపారు. విషయం తెలిసి ఘటనాస్థలానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.35 గంటలకు బైక్‌లపై వచ్చిన ఆరుగురు నిందితులు మాస్కులు ధరించి షాప్‌లోకి చొరబడ్డారని, అందులో ముగ్గరి వద్ద గన్‌లు ఉన్నట్లు తెలిపారు. 10.35 నిమిషాల నుండి 10.45 నిమిషాల వరకు నిందితులు షాప్‌లోనే ఉన్నారని, షాప్‌లోకి చొరబడిన నిందితులు ముందుగా సీసీటీవీ కెమెరాపై కాల్పులు జరిపారని అన్నారు. అనంతరం లాకర్ తాళాలు ఇవ్వాలంటూ అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కుమార్‌పై కాల్పులు జరిపారని అతని కాలుకు గాయాలు అయినట్లు తెలిపారు. ఘటన స్థలంలో రెండు ఖాళీ క్యాట్రిడ్జ్‌లు దొరికాయని అన్నారు. బంగారు అభరణాల కౌంటర్లను మాత్రం దుండగులు తెరువలేదన్నారు. దోపిడీకి పాల్పడిన సమయంలో దుండగులు రెండు రౌండ్ల కాల్పులు జరిపారని, షాపులో వెండి అభరణాలు ఉన్న కౌంటర్లను ధ్వంసం చేసి వెండి వస్తువులనుమాత్రమే ఎత్తుకెళ్లారని, వాటి విలువ ఎంత ఉంటుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయాలైన అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. నిందితులు జహీరాబాద్‌వైపుకు పారిపోయినట్లు తెలుస్తుందని,వారిని పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చుట్టుప్రక్కల జిల్లాల పోలీసులను, టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుండి వచ్చారు అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# బోధన, పరిశోధనల్లో క్వాంటం కంప్యూటింగ్ కీలకం



**విజయవాడ, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

సమీప భవిష్యత్తుల్లో క్వాంటం కంప్యూటింగ్ అన్ని రంగాల్లో కీలకం కానున్నదని, ప్రత్యేకంగా బోధన, పరిశోధన రంగాల్లో క్వాంటం అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. సౌజన్య అన్నారు. కెబిఎన్ కళాశాల ఐక్యుఎసి విభాగం ఆధ్వర్యంలో "క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్ సాంకేతిక విప్లవం" అనే అంశంపై నిర్వహించిన అధ్యాపక శిక్షణ కార్యక్రమంలో సౌజన్య ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధన, పరిశోధన రంగాల్లో అన్వయించేందుకు క్వాంటం సిద్ధాంతాలు ఉపయోగిస్తాయన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాథమిక సూత్రాలు, క్లాసికల్ కంప్యూటింగ్ కి ఉన్న తేడాలు, క్వాంటమ్ బిట్స్ (క్విబిట్స్) ప్రాధాన్యత, సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి కీలక సూత్రాలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిశోధనలు, క్వాంటమ్ అల్గారిథంలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోగ్రఫీ, మెడికల్ రీసెర్చ్ వంటి విభాగాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ విస్తృత ప్రయోగాలను ఉదాహరణలతో చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణ వేణి మాట్లాడుతూ అత్యాధునిక పరిశోధనలు, అంశాల గురించి అధ్యాపకులు ఉత్తమ అవగాహన పొందాలని, ఆ విషయాలను తమ బోధనలో మేళవిం చినప్పుడో బోధనకు సార్థకత చేకూరుతుందన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని వివిధ నైపుణ్యాలను మెరుగుపరుకుని పూర్తిస్థాయిలో వాటిని వినియో గపరిచేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ ఉపయోగిస్తుందన్నారు. ఐక్యుఎసి కో ఆర్డినేటర్ షమీమ్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సాయికృష్ణ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

**అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలి: కలెక్టర్ లక్ష్మీ శ**



**విజయవాడ, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీ శ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చేపట్టిన తుది ఏర్పాట్లను మంగళవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీ శ, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల15వ తేది శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నగరపాలక సంస్థ, సాధారణ పరిపాలన శాఖ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఫైర్ శాఖలతో సమన్వం చేసుకుని ఇటు వంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రణాళికబద్ధంగా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. సామా న్య ప్రజలకు విఐపిలు, వివిఐపిలకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు ఉండాలని, వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ను మరొకసారి పరిశీలించి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీవో కే చైతన్య, అడిషనల్ సిపి కేజీవి సరిత, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# పెద్ద అవుటపల్లి సిడ్నీ స్కూల్ నందు ఘనంగా క్యాబినెట్ ప్రోగ్రామ్




**గన్నవరం,ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, పెద్ద అవుటపల్లి గ్రామంలోని, సిడ్నీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మంగళవారం ఉదయం క్యాబినెట్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు మండలం ఎంఈఓ సాంబశివరావు హాజరయ్యారు. ఎంఈఓ ఆధ్వర్యంలో టీచర్స్ తల్లిదండ్రుల సమక్షంలో క్లాస్ లీడర్స్, క్లాస్ సెక్రటరీలకు బ్యాడ్జీలు పెట్టి వారిని అభినందించారు. తదనంతరం ఎంఈఓ సాంబశివరావు మాట్లాడుతూ స్కూల్ వాతావరణం చాలా బాగుందని, క్లాసులు కూడా అందంగాను క్రియేటివ్ గా అలంకరించారని టీచర్స్ ను స్కూల్ సిబ్బందిని అభినందించారు. స్కూల్స్ నందు జరగవలసిన కార్యక్రమాలలో సిడ్నీ స్కూల్ ఎప్పుడు ముందుగానే అన్ని సక్రమంగా వీరు నిర్వర్తిస్తారని తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ అయిన మార్గరెట్ ఆధ్వర్యంలో అకాడమిక్ అన్ని ఆక్టివిటీస్ క్రమశిక్షణతోను నిబద్ధతతోను జరిపిస్తారని, ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ప్రతి క్లాస్ నుండి పిల్లలు వచ్చి వారి పాఠశాల గురించి పరిశుభ్రత గురించి విద్య దాని ప్రాముఖ్యత, నాయకత్వం గురించి ఎంతో చక్కగా వివరించారు. తదుసరి క్లాస్ లీడర్స్ అందరూ బ్యాడ్జీలు స్వీకరించారు. ప్రత్యేకంగా కార్యక్రమం లో పాల్గొన్న తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమం విజయవంతం చేసినందుకు స్కూల్ సిబ్బంది, స్కూల్ టీచర్స్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.

# వికసిత్ భారత్‌కు విలువైన మానవ వనరులు కీలకం

- విద్యార్థుల మేధస్సు వికసించేలా ప్రోత్సహించాలి
- సృజనాత్మక ఆలోచనలు చేసేలా అవకాశాలు సృష్టించాలి
- సమస్య పరిష్కార నైపుణ్యాలూ పెంపొందించడం ముఖ్యం
- హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్ వర్క్‌షాప్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి అద్భుత మేధో సంపత్తితో పాటు విలువైన మానవ వనరులు కీలకమని.. ఈ నేపథ్యంలో భావి భారత పౌరులైన చిన్నారుల సమగ్రాభివృద్ధికి సరైన ప్రణాళికలతో సమష్టి కృషి అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్ (స్కూలింగ్: బిల్డింగ్ బ్లాక్స్)పై ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. సమన్వయ శాఖల అధికారులు, మండల విద్యాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు తదితరులు హాజరైన ఈ వర్క్‌షాప్‌నకు కలెక్టర్ లక్ష్మీశ హాజరై వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టాలనే గొప్ప లక్ష్యంతో రూపొందిన వికసిత్ భారత్ దార్శనికత లక్ష్యాలను సాధించేందుకు అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి అవసరమని.. మనం ఏది సాధించాలన్నా సమర్థమైన మానవ వనరులే కీలకమని.. ఈ నేపథ్యంలో మనం ఇప్పుడు అమలు చేస్తున్న విద్యా ప్రణాళికలకు కొత్త అంశాలను జోడిస్తూ ముందు కెళ్లాల్సిన అవసరముందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యా ప్రణాళికలను బలోపేతం చేసేందుకు చర్చల ద్వారా వినూత్న ఆలోచనలతో స్థానికంగా అమలుచేయగల వ్యూహాలను రూపొందించేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన మెరుగైన ఆలోచనలతో నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ ఆలోచనలే అత్యుత్తమ విధానాల రూపకల్పనకు ఉపయోగపడతాయన్నారు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కొత్త తరం అంతరిక్ష సాంకేతికత.. ఇలా ప్రపంచ విజ్ఞానం వడివడిగా ముందుకెళ్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన అవసరముందన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, సమస్యలకు కొత్త పరిష్కారాలను ఆవిష్కరించేందుకు విద్యార్థుల్లో అప్లికేషన్‌తో సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరముం దన్నారు. శారీరకంగానే కాకుండా మానసికంగానూ దృఢంగా ఉండేలా సహపాఠ్య ప్రణాళికలను అమలుచేయాలన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో ప్రస్తుత సవాళ్లు, కమ్యూనిటీ భాగస్వామ్యం, సమానత, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయులకు నైపుణ్యాలు పెంపు, డిజిటల్ పాఠ్య ప్రణాళిక, సమాచార సాంకేతిక వినియోగంపై బృంద చర్చలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పాల్గొన్నారు.

# అల్బెండజోల్‌తో నులి పురుగుల ఆటకట్టు

- ఆదిలోనే నిర్మూలనకు సురక్షితమైన మార్గం
- అందుకే చిన్నారులు, కిశోర బాలలు తప్పనిసరిగా తీసుకోవాలి
- నులి పురుగులతో రక్తహీనత, పోషకాల లోపాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

నులి పురుగులు పిల్లలు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమవుతాయని.. అందుకే అల్బెండజోల్ మాత్రను తీసుకోవడం ద్వారా ఆదిలోనే వాటిని నిర్మూలించవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరగ్గా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి చిన్నారులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తాయని.. ఈ పరిస్థితి చదువుపైనా సమగ్ర వికాసంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుం దని పేర్కొన్నారు. అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగులను కేవలం ఒకే ఆల్బెండజోల్ మాత్రతో నివారించ వచ్చని.. నులిపురుగుల నిర్మూలన ద్వారా పోషకాల లోపం, అలసట, బలహీనత వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చన్నారు. అందువల్ల ఒక సంవత్సరం నిండిన పిల్లల నుంచి 19 సంవత్సరాల వరకు అందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని.. ఇంకా ఎవరైనా వివిధ కారణాల వల్ల మాత్ర తీసుకోకుండా ఉండిపోతే వారికి ఈ నెల 20 వ తేదీన స్పెషల్ డ్రైవ్ చేపట్టి మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నులిపురుగుల సంక్రమణాన్ని తగ్గించేందుకు డీవార్మింగ్‌కు అదనంగా పాటించాల్సిన విషయాలను కూడా వివరించారు. శుభ్రమైన నీటిని తాగడం, చేతులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం వంటివాటిని కలెక్టర్ లక్ష్మీశ చిన్నారులకు తెలియజెప్పారు. రాష్ట్ర ఆర్‌కేఎస్‌కే, ఐఈసీ ప్రోగ్రామ్ అధికారి డా. నిర్మలా గ్లోరి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని.. అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలను వివరించారు. ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి.. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డా. మాధవి, పీడియాట్రిషన్ డా. రవితేజ, లబ్బీపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. భార్గవి, హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో సైనికుల సేవలు మరువలేం

- మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో ఉద్యోగ అవకాశాలు
- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఆధునిక వ్యవసాయానికి సూచిక
- హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్




**విజయవాడ, ఆగస్టు 13(జర్నలిస్ట్‌ఫైల్):**

మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో మరోసారి దేశానికి, సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్ మరియు దక్ష డ్రోన్స్ ఆధ్వర్యంలో హోటల్ మినర్వాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మాట్లాడుతూ దేశానికి సేవలు అందించిన మాజీ సైనికోద్యోగులు డ్రోన్ల వినియోగంతో మరోసారి సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందన్నారు. దీని ద్వారా వాళ్లు ఉపాధి పొందుతూ కొద్దిమందికి స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పించవచ్చాన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉందని, మాజీ సైనికోద్యోగులకు ఎంతో సేవలు అందిస్తుం దన్నారు. అంతేకాకుండా వారికి ఇంకా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనాఉం దన్నారు. దేశ రక్షణకు పాటుపడిన వారికి ఎన్ని అవకాశాలు కల్పించినా తక్కువేనన్నారు. డ్రోన్ల వినియోగంలో కోరమాండల్ కల్పిస్తున్న అవకాశాలను వారు ఉపయోగించుకోవాలని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. కోరమాండల్ కంపెనీ, మాజీ సైనికోద్యోగులు ఇద్దరూ దీన్ని ఉపయోగించుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధారిత రాష్ట్రమని రైతులు ఎరువులు, పురుగు మందుల వినియోగానికి డ్రోన్ల ద్వారా స్ప్రే చేయడంతో తక్కువ సమయంలో పని పూర్తి చేయవచ్చన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో పునర్ నిర్మిస్తున్నామన్నారు. డ్రోన్ల వినియోగంతో అటు కంపెనీకి, ఇటు మాజీ సైనికోద్యోగులకు కూడా మంచి జరుగుతుందన్నారు. రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ అతి త్వరలోనే సైనిక వెల్ఫేర్ డిపార్ట్ మెంటులో ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. మన డిపార్ట్ మెంట్ కు సంబంధించిన విషయాలు హోమ్ శాఖకు వెళ్లిన వెంటనే హోంశాఖ కార్యదర్శి స్పందిస్తూ పూర్తి చేస్తున్నారన్నారు. మాజీ సైనికోద్యోగులు పిల్లలను పోషించే సమయంలో పెన్షన్ పై జీవితాన్ని నెట్టుకొస్తున్నారని, ఎక్కువ మంది 35 సంవత్సరాల వయస్సుకే దేశం కోసం సర్వీసు నుంచి డిశ్చార్జి చేస్తున్నారన్నారు. వేరే ఆదాయం పెంచుకునేలా చూసుకోవాల్సిన అవసరం మాజీ సైనికోద్యోగులకు ఏర్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిద సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం వీరిపై ఉందన్నారు. కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో దక్ష డ్రోన్స్ ఉచిత శిక్షణ తీసుకుని మరోసారి దేశానికి, రాష్ట్రానికి సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్స్‌ను వ్యవసాయ రంగంలోనే కాకుండా ఎన్నో విధాలుగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. దక్ష డ్రోన్స్ సీఈవో సమీర్ సచిదానంద మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో డ్రోన్ల ద్వారా ఆధునిక వ్యవసాయం చేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. మాకు ఇక్కడ అవకాశం కల్పించారని దాన్ని సద్వినియోగం చేసుకుంటా మన్నారు. ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ ఎండీ ఆదిత్య మనోహర్ మాట్లాడుతూ డ్రోన్ల టెక్నాలజీలో మెలుకు వలను ఉపయోగించే పద్ధతులను మాజీ సైనికోద్యో గులకు అందిస్తామన్నారు. స్వాగతోపన్యాసం చేసిన సీవోవో కె. శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ డ్రోన్ ల గురించి అవగాహన కల్పించటం, ఔత్సాహికులకు అన్ని విధాలుగా సహకరించే అగ్రగామి సంస్థ ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ అని వివరించారు. కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి. సత్య ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి డా. కె. కళ్యాణ వీణ, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

# జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలు



## ● తీర్మానంపై లోక్‌సభలో చర్చకు ఆమోదించిన స్పీకర్ ఓం బిర్లా ● ఆరోపణలపై విచారణకు త్రిసభ్య కమిటీ ● విచారణ ప్రక్రియ పారదర్శకంగా ఉందన్న 'సుప్రీం'

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత న్యాయవ్యవస్థ చరిత్రలో అత్యంత అరుదైన, రాజ్యాంగపరంగా కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన ప్రక్రియకు లోక్‌సభ మంగళవారం శ్రీకారం చుట్టింది. ఆయన అధికారిక నివాసంలో కాలిపోయిన స్థితిలో భారీగా నగదు కట్టలు లభ్యం కావడం ఈ పరిణామాలకు దారితీసింది. ఈ అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలో అధికారికంగా చదివి వినిపించారు. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలోని జస్టిస్ వర్మ ప్రభుత్వ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కాలిపోయిన కరెన్సీ నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై జరిగిన అంతర్గత న్యాయ విచారణలో, ఆ నగదుపై జస్టిస్ వర్మకు రహస్య లేదా క్రియాశీలక నియంత్రణ ఉందని తేలింది. ఈ నివేదిక ఆధారంగా, భారత ప్రధాన న్యాయమూర్తి ఆయనను పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేశారు.

దీనిని అనుసరించి, రవిశంకర్ ప్రసాద్‌తో పాటు లోక్‌సభ నుంచి 146 మంది, రాజ్యసభ నుంచి 63 మంది సభ్యులు సంతకాలు చేసిన అభిశంసన తీర్మాన నోటీసును జులై 31న స్పీకర్‌కు అందజేశారు. ఈ తీర్మానంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, దానిని చర్చకు స్వీకరిస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఈ తీర్మానంలో తగిన బలం ఉందని నేను భావిస్తున్నాను. అందుకే దీనిని స్వీకరించి, ఆరోపణలపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నానని ఆయన తెలిపారు. జడ్జిల విచారణ చట్టం 1968 ప్రకారం ఏర్పాటైన ఈ త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.వి. ఆచార్య సభ్యులుగా ఉంటారని స్పీకర్ వెల్లడించారు.

ఈ కమిటీ నివేదిక ఇచ్చేంత వరకు తీర్మానం పెండింగ్‌లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు, అంతర్గత విచారణ నివేదికను సవాలు చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్‌ను గత వారం సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

విచారణ ప్రక్రియ పారదర్శకంగా, రాజ్యాంగ బద్ధంగా ఉందని పేర్కొంది. స్వతంత్ర భారత చరిత్రలో ఒక సిట్టింగ్ జడ్జిపై అభిశంసన ప్రక్రియ ప్రారంభం కావడం ఇది కేవలం మూడోసారి. ఒకవేళ విచారణ కమిటీ ఆరోపణలు నిజమేనని తేలిస్తే, ఈ తీర్మానం పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీతో సభలో హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండొంతుల మంది, సభ మొత్తం సభ్యుల్లో మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత తుది ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపుతారు.





### గాజాలో మారణహోమానికి

# పాల్పడుతున్న ఇజ్రాయెల్

## ప్రియాంక గాంధీ తీవ్ర ఆరోపణ

### హమాస్ ఉగ్రవాదులనే చంపామన్న ఇజ్రాయెల్ రాయబారి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని, ఇప్పటికే వేలాది మంది మరణానికి కారణమైందని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ ఆరోపించారు. వీటిని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఖండించారు. గాజాలోని వేలాది మంది హమాస్ ఉగ్రవాదులనే తాము చంపామని బదులిచ్చారు. గాజాలో నెలకొన్న పరిస్థితులపై స్పందించిన ప్రియాంక 'ఇజ్రాయెల్ మారణ హోమానికి పాల్పడుతోంది. 60 వేల మందిని హత్య చేసింది. వారిలో 18,430 మంది చిన్నారులే. పిల్లలు సహా అనేక మంది ఆకలితో చనిపోయారు' అని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచం మౌనంగా ఉండటాన్ని ఖండించిన ఆమె ఇలా ఉండటం కూడా నేరమేనంటూ భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ స్పందించారు. మీ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. 25వేల మంది హమాస్ ఉగ్రవాదులను ఇజ్రాయెల్ చంపింది. సామాన్యుల వెనుక దాక్కొని హమాస్‌హేయమైన వ్యూహాలకు పాల్పడుతుండటం వల్ల ప్రాణనష్టం మరింత పెరుగుతోంది అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ 20 లక్షల టన్నుల ఆహార పదార్థాలను గాజాలోకి పంపించిందని, హమాస్ మాత్రం వారిని నిర్బంధిస్తోందని ఆరోపించారు. ఇదే అక్కడ ఆకలికి కారణమవుతోందన్నారు. గాజాలో మారణహోమం లేదని, గడిచిన 50 ఏళ్లలో అక్కడి జనాభా 450 శాతం పెరిగిందన్నారు.

# పాక్ ఆర్మీచీఫ్ ఆసీం మునీర్ లాడెన్ వంటివాడు

## పెంటగాన్ మాజీ అధికారి మండిపాటు

**వాషింగ్టన్, ఆగస్టు 13:** అమెరికా పర్యటనలో ఉండగానే పాక్ సైన్యాధిపతి ఆసీం మునీర్ అణు బెరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ బెదరింపులపై పెంటగాన్ మాజీ అధికారి మైఖెల్ రూబిన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆసీం మునీర్‌కు.. అల్‌ఖైదా మాజీ చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు పెద్ద తేడా లేదని వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అమెరికా గడ్డపై ఉండి పాక్ ఆర్మీచీఫ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ సందర్భంగా ఆసీం మునీర్ ప్రవర్తన ఒసామా బిన్‌లాడెన్‌లా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన మాటలను ట్రంప్ పరిపాలనాధికారులు వెంటనే ఖండించి.. దేశం నుంచి బహిష్కరించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తామని బెదరిస్తున్న పాక్.. చట్టబద్ధమైన దేశంగా ఉండే హక్కును కోల్పోయిందన్నారు.

ఇటీవల భారత దిగుమతులపై అమెరికా విధించిన సుంకాలపై కూడా రూబెన్ మాట్లాడారు. భారత ప్రధాని మోడీ దేశ హక్కులకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ న్యూఢిల్లీని లక్ష్యంగా చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ప్రస్తుత పరిపాలనా విధానం మారిన తర్వాత భారత్-యుఎస్ సంబంధాలు గణనీయంగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఒక వ్యాపారవేత్త అని.. చెడు శాంతి ఒప్పందం యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్తుందనే విషయం ఆయనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.



### అల్జీమర్స్ సీక్రెట్స్ ఛేదించేందుకు పిల్లులపై అధ్యయనం!

**ఎడిన్‌బర్గ్, ఆగస్టు 13:** మనుషుల్లో తీవ్రమైన మతిమరుపునకు కారణమయ్యే అల్జీమర్స్ వ్యాధి చికిత్స దిశగా శాస్త్రవేత్తలు ఒక కీలక ముందడుగు వేశారు. ఈవ్యాధి రహస్యాలను ఛేదించేందుకు పెంపుడు పిల్లులు ఒక అద్భుతమైన మార్గాన్ని చూపగలవని తాజా అధ్యయనంలో తేలింది. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌కు చెందిన శాస్త్రవేత్తలు మంగళవారం ఈ ఆసక్తికర వివరాలను వెల్లడించారు. వయసు పైబడిన పిల్లుల్లో కనిపించే మతిమరుపు (డిమెన్షియా) లక్షణాలకు, మనుషుల్లో అల్జీమర్స్‌కు మధ్య బలమైన సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన పిల్లులు తరచుగా అరవడం, గందరగోళానికి గురవడం, నిద్రలేమి వంటి సమస్యలతో బాధపడతాయి. ఇవే లక్షణాలు అల్జీమర్స్ బాధితుల్లో కూడా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో, మరణించిన 25 పిల్లుల మెదళ్లను పరిశీలించగా, మనుషుల్లో అల్జీమర్స్‌కు కారణమయ్యే అమైలాయిడ్ బీటా అనే హానికర ప్రోటీన్ వాటి మెదళ్లలోనూ పేరుకుపోయినట్లు కనుగొన్నారు. శక్తివంతమైన మైక్రోస్కోపీ ద్వారా చేసిన ఈ పరిశీలనలో, నాడీ కణాల మధ్య సమాచారాన్ని చేరవేసే కీలక ప్రాంతాలైన సినాప్సెస్ వద్ద ఈ ప్రోటీన్ నిల్వలు అధికంగా ఉన్నట్లు తేలింది. అల్జీమర్స్ వ్యాధిలో జ్ఞాపకశక్తి తగ్గడానికి ఈ సినాప్సెస్ దెబ్బతినడమే ప్రధాన కారణం. అంతేకాకుండా, మెదడులోని సహాయక కణాలైన ఆస్ట్రోసైట్లు, మైక్రోగ్లియా ఈ దెబ్బతిన్న సినాప్సెస్‌ను తొలగిస్తున్నట్లు కూడా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రక్రియను సినాప్టిక్ ప్రూనింగ్ అంటారు. ఇది మెదడు అభివృద్ధి దశలో అవసరమైనప్పటికీ, వ్యాధి బారిన పడినప్పుడు మాత్రం నష్టాన్ని కలిగిస్తుంది. ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన రాబర్ట్ ఐ. మెక్‌గెచన్ మాట్లాడుతూ, గతంలో అల్జీమర్స్ పరిశోధనల కోసం జన్యుపరంగా మార్పులు చేసిన ఎలుకలపై ఆధారపడేవారు. కానీ వాటికి సహజంగా మతిమరుపు రాదు. పిల్లులు సహజంగానే ఈ సమస్యను ఎదుర్కొంటాయి. అందువల్ల, పిల్లులపై చేసే అధ్యయనాలు మనుషులకూ, పిల్లులకూ ఉపయోగపడే కొత్త చికిత్సల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ ఆవిష్కరణతో భవిష్యత్తులో అల్జీమర్స్ వ్యాధికి మరింత మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ అధ్యయన వివరాలు యూరోపియన్ జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్‌లో ప్రచురితమయ్యాయి.

# గుజరాత్ 'రిల్' రిఫైనరీ టార్గెట్‌చేస్తాం!

## అమెరికా గడ్డపైనుంచి పాక్ ఆర్మీచీఫ్ వార్నింగ్



**ఫ్లోరిడా, ఆగస్టు 13:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ అమెరికా వత్తాసుతో భారత్‌పై ప్రేలాపనలకు దిగుతున్నారు. మరోసారి తన వాచాలత్వాన్ని బయటపెట్టుకున్న ఆసిమ్‌మునీర్ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్‌సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్టును ప్రస్తావించారు. అంతేకాదు, భారత్‌కు అణు హెచ్చరికలు కూడా చేశారు.

అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు.

అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారా మిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షలమంది మాత్రమేఉన్నారు. రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

# బంగ్లాదేశ్ జనపనార ఉత్పత్తులపై భారత్ బ్యాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** బంగ్లాదేశ్‌తో వాణిజ్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ నుంచి దిగుమతి అయ్యే మరిన్ని జనుము సంబంధిత ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ ఆంక్షల జాబితాను విస్తరించింది. భూ సరిహద్దుల ద్వారా ఈ ఉత్పత్తుల దిగుమతిని తక్షణమే నిషేధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్టీ) ఉత్తర్వులు జారీ చేసింది. డిజిఎఫ్టీ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం బంగ్లాదేశ్ నుంచి వచ్చే జనుముతో చేసిన వస్త్రాలు, జనపనార దారాలు, తాళ్లు, గోనె సంచులు వంటి ఉత్పత్తులను ఇకపై భూమార్గం ద్వారా దిగుమతి చేసుకోరాదు. కేవలం నవీ ముంబైలోని నవా షేవా ఓడరేవు ద్వారా మాత్రమే వీటికి అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్, అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లోని అన్ని భూ సరిహద్దు కస్టమ్స్ స్టేషన్లు, సమీకృత చెక్ పోస్టుల వద్ద ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వచ్చాయి. అయితే, బంగ్లాదేశ్ నుంచి నేపాల్, భూటాన్‌లకు వెళ్లే ఎగుమతులకు ఈ నిబంధనలు వర్తించవని, కానీ ఆ దేశాల నుంచి తిరిగి భారత్‌లోకి ఈ వస్తువులను పునఃఎగుమతి చేయడానికి వీల్లేదని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆంక్షలు విధించుకోవడం ఇదే మొదటిసారి కాదు. గత కొంత కాలంగా ఈ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ ప్రభుత్వం భూమార్గాల ద్వారా భారత్ నుంచి నూలు దిగుమతిని నిషేధించింది. దీనికి ప్రతిగా భారత్ కూడా పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. మే నెలలో బంగ్లాదేశ్ నుంచి రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ఫర్నిచర్‌వంటి సుమారు 770 మిలియన్ డాలర్ల అంటే భారత కరెన్సీలో రూ. 6,600 కోట్ల విలువైన వస్తువుల దిగుమతిని భూమార్గాల ద్వారా నిషేధించింది. జూన్‌లో మరికొన్ని నార ఉత్పత్తులపైనా ఇలాంటి ఆంక్షలనే విధించింది. చైనా తర్వాత బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం సుమారు 16 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో బంగ్లాదేశ్ భారత్‌కు 2 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేయగా, భారత్ నుంచి సుమారు 14 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. తాజా పరిణామాలు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత దెబ్బతీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమిత్‌షాను పొగిడారని సిపిఎం, చర్చి పెద్దలమధ్య డైలాగ్ వార్!



**తిరువనంతపురం, ఆగస్టు 13:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రశంసించినందుకు కేరళలో అధికార సిపిఎం, క్యాథలిక్ చర్చి మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపగా, చర్చి వర్గాలు తీవ్రంగా స్పందించి ఎదురుదాడికి దిగాయి. ఈ పరిణామంతో కేరళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో తప్పుడు ఆరోపణలతో ఇద్దరు క్రిస్టియన్ నన్‌లను అరెస్ట్ చేశారు. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని వారి విడుదలకు సహకరించారు. దీనిపై తలస్సరీ ఆర్చిబిషప్ మార్ జోసెఫ్ పంప్లానీ, అమిత్ షాకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసించారు. అయితే, ఆర్చిబిషప్ తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్‌ల అరెస్ట్ సమయంలో బిజెపిని విమర్శించి, బెయిల్ వచ్చిన తర్వాత అమిత్ షాను పొగడటం ఆర్చిబిషప్ అవకాశవాదానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. గోవిందన్ వ్యాఖ్యలపై కేరళ క్యాథలిక్ కాంగ్రెస్, తలస్సరీ ఆర్చిడయాసిస్ తీవ్రంగా మండిపడ్డాయి.

గోవిందన్ వ్యాఖ్యలు ఆయన హోదాకు తగనివని, అవివేకంతో కూడుకున్నవని కేరళ క్యాథలిక్ కాంగ్రెస్ ప్రతినిధి ఫాదర్ ఫిలిప్ కవియిల్ విమర్శించారు. గోవిందన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటారో లేదో ఆయన ఇష్టం. కానీ, పినరయి విజయన్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలా వద్దా అనే విషయం కూడా ఆయన ఆలోచించుకోవాలంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. తలస్సరీ ఆర్చిడయాసిస్ కూడా ఘాటుగా స్పందించింది. బిషప్‌లు సిపిఎం పార్టీ ప్రధాన కార్యాలయం ఎకెజి సెంటర్ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలా అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పడం తమ బాధ్యత అని స్పష్టం చేసింది. అవకాశవాది అనే పదం గోవిందన్‌కు సరిగ్గా సరిపోతుందని, ఆయన వ్యక్తిగత బలహీనతలను ఇతరులకు ఆపాదించవద్దని హితవు పలికింది. గోవిందన్ వ్యాఖ్యలు ఆయన ప్రతిష్ఠకే కాకుండా, పార్టీకి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కూడా రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయని హెచ్చరించింది.

### చాట్‌జిపిటికి కొమ్ముకాస్తున్న యాపిల్

## యాపిల్ యాప్‌స్టోర్‌పై ఎలాన్ మస్క్ ఫైర్

**సియాటెల్, ఆగస్టు 13:** టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేధ (ఎఐ) ఆధిపత్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, టెక్ దిగ్గజం యాపిల్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ మంగళవారం న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు. యాపిల్ తన యాప్ స్టోర్‌లో ఓపెన్ ఎఐకి చెందిన చాట్‌జీపీటీకి అనైతికంగా కొమ్ముకాస్తోందని, ఇది తమ సొంత ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ ఎదుగుదలను అడ్డుకుంటోందని ఆయన మండిపడ్డారు. యాపిల్ ప్రవర్తిస్తున్న తీరు వల్ల, ఓపెన్‌ఎఐ తప్ప మరే ఇతర ఎఐ కంపెనీ యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకోవడం అసాధ్యంగా మారింది. దీనిపై ఎక్స్‌ఎఐ తక్షణమే చట్టపరమైన చర్యలు తీసు కుంటుందని మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. యాపిల్ ఈ విషయంలో చిన్నపాటి పక్షపాతం చూపడం లేదు, ఏకంగా వాళ్ల బరువునంతా మోపిందంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్‌ఎఐ రూపొందించిన గ్రాక్, ఓపెన్‌ఎఐకి చెందిన చాట్‌జీపీటీ మధ్య పోటీ తీవ్రమవుతున్న తరుణంలో ఈ ఆరోపణలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బంగారంపై సుంకాలు విధించం

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ



**వాషింగ్టన్, ఆగస్టు 13:** తమ దేశం దిగుమతి చేసుకునే వివిధ దేశాల వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ స్థాయిలో సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దిగుమతి చేసుకొనే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా? అనే విషయమై సందిగ్ధతనెలకొంది. దీనిపై ట్రంప్ వివరణ ఇస్తూ సుంకాలు విధించబోమని స్పష్టం చేశారు. అమెరికా కస్టమ్స్ విభాగం గత వారం విడుదల చేసిన ప్రకటనలో.. ఒక కేజీతోపాటు 100 ఔన్సుల (2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

ఇదే సమయంలో బంగారంపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇచ్చేందుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేస్తారంటూ ఓ వైట్‌హౌస్ అధికారి వ్యాఖ్యలు చేయడం మార్కెట్ వర్గాల్లో మరింత గందరగోళానికి కారణమైంది. ఈ నేపథ్యంలో పసిడి ధర కూడా రికార్డు స్థాయి గరిష్ఠానికి చేరుకుంది. బంగారంపై సుంకాలు లేవంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టు పెట్టిన వెంటనే ధర ఔన్సుపై 50 డాలర్ల మేర తగ్గింది. మరోవైపు స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి చేసుకునే బంగారంపై 39 శాతం సుంకం విధించాలని అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల నిర్ణయించారు. అయితే, స్విస్ సహా అనేక దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులకు ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందా? అనే విషయంపై స్పష్టం లేదని తెలుస్తోంది.

# సంక్షిప్తంగా..

### ఆగి ఉన్న విమానాన్ని ఢీకొట్టిన మరో విమానం

**కాలిస్పెల్ (యుఎస్), ఆగస్టు 13:** అమెరికాలో మరోసారి విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మోంటానా విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న ఓ చిన్న విమానం.. ఆగి ఉన్న మరో విమానాన్ని ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు తెలిపారు. నలుగురు ప్రయాణికులతో వెళ్తున్న సింగిల్ ఇంజిన్ విమానం కాలిస్పెల్ సిటీ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నదని కాలిస్పెల్ పోలీసు చీఫ్ జోర్డాన్ వెనెజియో, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. సోకాటా టిబిఎం 700 టర్బోప్రాప్ విమానం అప్పటికే ఆగి ఉన్న ప్రయాణికులు లేని విమానాన్ని ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో ఉన్న పైలట్, ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. అయితే ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారని, వారికి ఎయిర్‌పోర్టులోనే చికిత్స అందించామని వెల్లడించారు.

### ఉగ్రవాద సంస్థగా బిష్ణోయ్ గ్యాంగ్‌ను ప్రకటించాలి



**టొరంటో, ఆగస్టు 13:** కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కోరుతూ కన్జర్వేటివ్ పార్టీ తాజాగా మార్క్ కార్నీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ గ్యాంగ్ సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కెనడాలో బిష్ణోయ్‌గ్యాంగ్ ఆగడాలు పెరుగుతున్నాయంటూ స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కపిల్ శర్మ కేఫ్‌పై రెండుసార్లు కాల్పులు జరగడం తీవ్ర కలకలం రేపింది. ఈ కాల్పుల్లో బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉందనే వాదనలు వినిపించాయి. ఈ నేపథ్యంలో లారెన్స్ బిష్ణోయ్ సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకుంటోందని, హత్య కేసుల్లో వారి ప్రమేయం ఉందని కెనడా ఎంపీ ఫ్రాంకా కాపుటో ఆ లేఖలో పేర్కొన్నారు. స్థానికంగా, విదేశాల్లో పలు హింసాత్మక ఘటనలకు తామే బాధ్యులమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుందని గుర్తు చేశారు.

### మజీద్‌బ్రిగేడ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన అమెరికా

**క్వెట్టా, ఆగస్టు 13:** పాకిస్థాన్ నుంచి స్వేచ్ఛను కోరుతూ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. స్వతంత్ర బలూచిస్థాన్ లక్ష్యంగా పాక్ ఆర్మీపై తీవ్ర దాడులకు కూడా తెగబడుతోంది. మరోవైపు బిఎల్ఎకు అమెరికా షాక్ ఇచ్చింది. బిఎల్ఎను, దానికి చెందిన మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా అమెరికా ప్రకటించింది. బిఎల్ఎకు గతంలోనే ఇచ్చిన స్పెషల్లీ డిజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ క్లాసిఫికేషన్‌లో మజీద్ బ్రిగేడ్‌ను కూడా చేర్చింది. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ 2019 నుంచి జరిగిన ఎన్నో దాడులకు బిఎల్ఎ బాధ్యత వహించిందని చెప్పారు. వీటిలో మజీద్ బ్రిగేడ్ చేసిన దాడులు కూడా ఎన్నో ఉన్నాయని తెలిపారు. బిఎల్ఎను 2019లో స్పెషల్లీ డిజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ గా అమెరికా గుర్తించింది. మరోవైపు 2024లో కరాచీ ఎయిర్ పోర్టు, గ్వాదర్ పోర్ట్ అథారిటీ కాంప్లెక్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడులు, 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం వంటివి తామే చేసినట్టు బిఎల్ఎ ప్రకటించుకుంది.

### బీహార్ ఓటరు జాబితాపై ఆగని నిరసనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడి వంటి విపక్ష పార్టీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం కూడా విపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఆందోళనల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీతో సహా పలువురు ప్రతిపక్ష నేతలు 'మింతాదేవి' అనే బీహార్ ఓటరు ఫొటోతో ఉన్న టీ షర్టులు ధరించి పార్లమెంట్ వెలుపల నిరసనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓట్ల చోరీ అంశంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌లో బీహార్‌కు చెందిన మింతాదేవి గురించి ప్రస్తావించారు. మింతాదేవి పేరుతో ఉన్న ఓటర్ల ఐడిలో ఆమె వయసు 124 అని ముద్రించినట్లు రాహుల్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తి వయసు కంటే ఇది ఎక్కువని ఆయన తెలిపారు.

# గుంటూరు పోలీస్ పెట్రోల్ బంక్‌కి ఉత్తమ నిర్వహణ అవార్డు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని పోలీస్ పెట్రోల్ బంక్ విక్రయాల విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ నిర్వహణ అవార్డును కైవసం చేసుకుంది. ఇండియన్ ఆయిల్ పెట్రోలియం కార్పొరేషన్ విజయవాడ రీజియన్ ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన రిటైల్ ఔట్‌లెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఆగస్టు 12న గుంటూరులోని హోటల్ అట్లాంటిస్‌లో జరిగిన రిటైల్ ఔట్‌లెట్ డీలర్ల సమావేశంలో విజయవాడ డివిజనల్ కార్యాలయ మేనేజర్ రాజేష్ చేతుల మీదుగా ఏఆర్ ఏఎస్పై రత్నకుమార్ అవార్డును స్వీకరించారు.
ఆగస్టు 13న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పోలీస్ పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. అవార్డు సాధనలో విశేష పాత్ర పోషించిన సిబ్బందిని, పర్యవేక్షణ అధికారి వెల్ఫేర్ ఆర్ఐ సురేష్‌ను ఆయన అభినందించారు. అనంతరం బంక్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, వాహనదారులకు నాణ్యత, పరిమాణం లోపంలేకుండా పారదర్శకంగా ఇంధనం అందించాలన్నారు. ప్రతి ఒక్కరు జవాబుదారీతనం కలిగి మర్యాదపూర్వకంగా మెలగాలని, పెట్రోల్ బంక్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలని సూచించారు.

## ఎంఈఓ1ల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి



**పార్వతీపురం మన్యం ,(జర్నలిస్ట్ ఫైల్)** ఎంఈఓ 1 ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ కు వినతిపత్రం అందజేసినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బుధ వారం జిల్లా కలెక్టర్ ను కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. ప్రధానంగా రెండు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగిందన్నారు. ఎంఈఓ 1 లుగా పనిచేస్తున్న వారిలో అత్యధికంగా 2017 నుండి ఒకే ప్రదేశంలో 8 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్నప్పటికీ ఇంతవరకు బదిలీలు నిర్వహించక పోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని,కావున ఎంఈఓ 1లకు బదిలీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అదేవిధంగా మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, మండలంలో ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ డి డి వో గా వ్యవహరిస్తున్న ఎంఈఓ 1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగాఉందని తెలియజేశామన్నారు. ఈ రెండు ప్రధాన సమస్యలపై పలుమార్లు తమ అసోసియేషన్ పక్షానప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఎంఈఓ 1 లందరూ తీవ్ర ఆవేదన చెందుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసామన్నారు. తమ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్తామని హామీ ఇచ్చారని, ఇందుకుగాను జిల్లా కలెక్టర్ కు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సామల పేర్కొన్నారు.

## ఎంపీటీసీ నూతన గృహప్రవేశానికి జడ్పీ చైర్మన్ ముత్యాల



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )** బ్రహ్మంగారి మఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ ఎల్లటూరి ఈశ్వర్ రెడ్డి తన కుమారుడు ఎల్లటూరి శివ రెడ్డితో కలిసి బుధవారం నాడు నూతన గృహప్రవేశం వేడుకను ఆత్మీయంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. నంది పల్లె విశ్వశాంతి స్కూల్ ఎదురుగా ఉన్న కొత్త గృహంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగి గ్రామ ప్రజలు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంలో కడప జడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేసి ఈశ్వర్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. "మీ కొత్త గృహం సుఖసంతోషాలు ఐశ్వర్యం ఆనందం నిండిన ఆలయం కావాలి అని ఆశీం-ర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు సర్పంచులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని ఈశ్వర్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

# ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- గడ్డిపాడు చెరువు నీటిని అగతవరప్పాడు కాలువకు మళ్లించండి
- ఏ సమస్య వచ్చినా వెంటనే తమను సంప్రదించండి
- ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండండి. ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా వెంటనే అందించండి.. గడ్డిపాడు చెరువు నీరు ఇళ్లలోకి చేరకుండా అగతవరప్పాడు కాలువలోకి వెంటనే మళ్లించండి అంటూ అధికారులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. గడ్డిపాడు ప్రాంతాలో రోడ్లపై నీళ్లు నిలిచి ఉండటంతో అక్కడ స్థానికులతో మాట్లాడారు. ఇళ్లలోకి నీళ్లు చేరాయా ? నిత్యావసర సరుకులు వంటి అత్యవసరమైనవి ఉన్నాయా ? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే అధికారులను సంప్రదించాలని చెప్పారు. గడ్డిపాడు చెరువు కారణంగా ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. చెరువు నీటిని అగతవరప్పాడు కాలువలోకి మళ్లిస్తామని చెప్పారు. విద్యుత్ స్తంభాల విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. గత ఐదేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కనీసం రోడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని చెప్పారు. వర్షా కాలంలో ఇంటిలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదని, నిత్యావసరాలకూ సమస్యలు ఎదుర్కొనే వారిని విమర్శించారు. తాము ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపబోతు న్నామని వెల్లడించారు. అనంతరం నగరంలోని బాలాజీ నగర్, ఇతర ప్రాంతాల్లోనూ ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు.

# భారమవుతున్న ఖరీఫ్

- వెద పద్ధతి వరి సాగు వ్యతలకు నెలవాయె.



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** డెల్టా ప్రాంతం ఖరీఫ్ వరిసాగు ఆదిలోనె హంసపాదు అన్న తీరుగా, రైతులను కౌలు రైతులను వ్యతలకు గురిచేస్తుంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవక పోవడంతో, వెద పద్ధతి ఖరీఫ్ వరిసాగుకు వరివిత్తనాలు చల్లి,సకాలంలో సాగునీరు అందక, వర్షాల కోసం ఆకాశం వైపు, ఆర్తిగా రైతులు చూసిన సమయంలో, కురవని వర్షం, అల్ప పీడనంతో భారీ వర్షం కురవడంతో, ఖరీఫ్,వెదపద్ధతి వరిసాగుకు, విత్తనాలు కుళ్ళిపోవడం, నీరులేక తప్పలై పోవడం, ఇలా ఇప్పటికి మూడు సార్లు విత్తనాలు చల్లిన రైతులు అనేక ఆటుపోట్లతో, ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలొ మంగళ వారం రాత్రి కురిసిన భారీవర్షంతొ, వెదపద్ధతి వరిసాగు చేసే రైతు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.వెద విత్తనం చల్లి నెలరోజులు కావస్తున్న తరుణంలొ, కొన్ని పొలాల్లొ నీరు నిల్వడం వల్ల, వరిసాగు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈక్రమంలొ కౌలురైతుల వ్యతలు వర్ణనాతీతం. ఎకరం పొలానికి 18నుండి 25బస్తాల ధాన్యం కౌలు, లేదా 30 వేలు డబ్బు కౌలు నడుస్తున్నది. మూడు రూపాయల వడ్డీకి, ఖరీఫ్ సాగుకోసం బయట వ్యక్తుల వద్ద రుణం తీసుకున్నరైతు, భారీ వర్షాల కారణంగా వెద పద్ధతి విత్తనం చల్లినరైతులు దిగాలు పడుతున్నారు. మరో మూడు రోజులు వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపధ్యంలొ, రైతుల ఆందోళన, ఆవేదన అంతుచిక్కని పరిస్థితిని తలపిస్తుంది. తెనాలి మండలంలొ దాదాపు 17వేల ఎకరాల్లో రైతులు, వెదపద్ధతి వరిసాగు ప్రారంభించారు. ప్రకృతి వైపరిత్యాల కారణంగా, రెండు సార్లు, మూడు సార్లు వెద విత్తనాలు చల్లిన పరిస్థితులున్నాయి. ప్రకటించిన భారీ వర్షాలవల్ల, కురిసిన భారీ వర్షం వల్ల, రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది. ఖరీఫ్ వెద పద్ధతి వరిసాగు వల్ల నష్టపోతున్న రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాల్సిన అవసరం లేక పోలేదు. ప్రధానంగా రైతులు కోరేది, తక్కువ రోజుల్లో పంటకు వచ్చే, వరివిత్తనాలు తెనాలి ప్రాంతంలొ అందుబాటులో లేవని, ఆవిత్తనాలు ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణి చేయాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు. ఎరువులు రైతు సహాయ కేంద్రాల ద్వారా అందించాలని, మునిగి పోయిన పొలాలను పరిశీలించి, రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, బాధిత రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

# అమెరికాపాలిట సింహస్వప్నం ఫిదేల్ కాస్ట్రో

- సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** సామ్రాజ్యవాద దేశం ప్రపంచ నియంతలా వ్యవహరిస్తున్న అమెరికాకు సింహస్వప్నం లా క్యూబా నేత పిడల్ కాస్ట్రో వ్యవవహరించేవాడని సిపియం జిల్లా కార్యదర్శి వర్గ జి.శివకుమార్ అన్నారు. బుధవారం నాడు బద్వేల్ టౌన్ సుందరయ్య భవన్ నందు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో క్యూబా విప్లవ నేత పెడల్ క్యాస్ట్రో 99. వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పెడల్ క్యాస్ట్రో 1926 ఆగస్టు 13న క్యూభా దేశం లో జన్మించి 2016 నవంబర్ 25న 90 సంవత్సరాల వయసులో మరణించాడని పేర్కొన్నారు. క్యూబాలో కమ్యూనిస్టుపార్టీఆఫ్ క్యూభా ను ఏర్పాటు చేసి1959నుండి 2008వరకు 49 సంవత్సరాల పాటు క్యూబా అధ్యక్షునిగా అధికారంలో ఉన్నాడని వారు గుర్తు చేశారు. క్యూబా మీద పెత్తనం చేయడం కోసం అమెరికా అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ పిడల్ క్యాస్ట్రో ను చంపడానికి వందల సార్లు ప్రయత్నం చేసిన అమెరికాకుయుక్తుల నుంచి తప్పించుకొని అమెరికాకు కొరకరాని కొయ్యగా సింహ స్వప్నంగ వ్యవహరించాడని వారు కొనియాడారు. ఆయన స్ఫూర్తితో లాటిన్ అమెరికా దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు అమెరికా పెత్తందారి వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాయని వారన్నారు. మన దేశఅంతర్గత విషయాలలో అమెరికా నునిత్యం జోక్యం చేసుకుంటూ ఉంటే మన పాలకులు ఏమాత్రం నోరు మెదపడం లేదని అమెరికా అధ్యక్షునికి దాసోహం అంటున్నారనివారు దుయ్యబట్టారు, ప్రపంచంలోనే అతి చిన్న దేశమైన క్యూబాపిడల్ కాస్ట్రో నాయకత్వంలో అమెరికా పెత్తనాన్ని వ్యవతిరేకించిందని అనేక విషయాల్లో ప్రపంచ దేశాలకు పిడిల్ కాస్ట్రో నాయకత్వంస్ఫూర్తి దాయాకమని అని వారు ప్రశంసించారు. మనదేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా పెత్తనాన్ని సహించకూడదని పాలకుల నిర్లిప్తతని ప్రశ్నించాలని, అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ టౌన్ పట్టణ కార్యదర్శి కే శ్రీనివాసులు పట్టణ కమిటీ సభ్యులు శివకుమార్, రాయప్ప, మోక్షమ్మా కైరున్, కొండయ్య, ప్రసాద్,వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాతిమా, తదితరులు పాల్గొన్నారు,

# క్షయవ్యాధిపైఅప్రమత్తత అవసరం



- వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** ఈరోజు స్థానిక నందులపేటలోని నైట్ షెల్టర్ నందు నివసిస్తున్న వృద్ధులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నందుల పేట యు పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ క్షయవ్యాధిఅంటువ్యాధిఅని ఒకరి నుండి మరొకరికి నోటి తుంపరల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందని తెలియజేసినారు. అదేవిధంగా క్షయ వ్యాధి లక్షణాలు గురించి వివరించారు క్షయ వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి నందు కళ్ళె పరీక్ష చేయించుకోవాలని తెలియజేసినారు.
ప్రతినెల నైట్ షెల్టర్ లోని వ్యక్తులను సందర్శించి వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఇస్తామని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెనాలి టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హాస్టల్స్ లోనూ వృద్ధాశ్రయంలోనూ సమూహముగా నివసిస్తున్న ప్రదేశాలలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత మాట్లాడుతూ డయాబెటిక్ ఉన్నవారికి రోగనిరోధక శక్తి తగ్గినట్లయితే క్షయ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్స్ సుమతీదేవి,శ్యామల, రవికుమార్, టీబి హెల్త్ విజిటర్ వాకదిలీప్ కుమార్ ఆశాకార్యకర్త భవాని, షెల్టర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టిన చైర్ పర్సన్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక,పలు వార్డులలో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. దళిత మూడవ వార్డులో 35 లక్షల రూపాయలతో ఈ టీ కాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణం,రెండు వైపులా సైడ్ కలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 20వ వార్డు పరిధిలో ఉప్పు బజార్లో సీసీ రోడ్డు నిర్మాణం, సైడ్ కాలువల నిర్మాణం 30 లక్షలతో చేపట్టనుండగా, ఆ పనులను ప్రారంభించారు. అనంతరం 26వ వార్డు పరిధిలోని పాండురంగపేటలో, పంట కాలువపై 16 లక్షల రూపాయలతో కల్వర్టు నిర్మాణ పనులకు చైర్ పర్సన్ టీ రాధిక భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని, వివిధ వార్డులలో, చేపడుతున్న అభివృద్ధి పనులు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసే లక్ష్యంతో పని చేస్తున్నామని , పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు సాధారణ నిధులు మినహా , ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు రాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వి.ఎమ్.లక్ష్మీపతి, ఎంహెచ్ఓ ఏసుబాబు, వార్డు కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, దేశు యుగంధర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తులు, వైస్ చైర్మన్ పెండ్యాల వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల వేతన వివక్ష తొలగించాలి




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. నర్సింగ్ వ్యవస్థ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ వర్ధంతి సందర్భంగా కమిటీ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర అధ్యక్షురాలు జి. దయామణి నర్సులకు పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జెఎసి చైర్మన్, సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు, మెడికల్, హెల్త్ విభాగంలోని ఇతర కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులతో పోలిస్తే నెలకు రూ. 13,000 తక్కువ వేతనం చెల్లించడం గత ప్రభుత్వ వివక్ష అని విమర్శించారు. ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దీనిని సరిచేసి మినిమం టైంస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం, ఎస్ఎస్ఏతో సహా అన్ని ప్రభుత్వ పథకాలలోని ఉద్యోగులందరికీ మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని కోరారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.జీవానందం మాట్లాడుతూ, గత వేతన పెంపు చర్చల్లో కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అంగీకరించిన ప్రకారం, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సులు, ఇతర క్యాడర్ ఉద్యోగులకు గత 3 సంవత్సరాల కలిపి 15 శాతం ఇంక్రిమెంట్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థానాలను భర్తీ చేయడంతో పాటు మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. పై డిమాండ్లను పరిష్కరించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

# ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

- మాజీ రాజ్యసభ సభ్యులు డాఎంఎన్. తులసీ రెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతదేశ వ్యాప్తంగా నేడు అమల్లో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, సంపద సృష్టి జరుగుతుందని, పని సంస్కృతి మెరుగవుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాఎం ఎన్. తులసీ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో వ్యవసాయం పండగా? దండగా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్నడాఎం ఎన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ ప్రతి మండలానికి ఒక కోల్డ్ స్టోరేజీ మరియు ఆహార ధాన్యాలను నిలువ చేసుకునే గోడౌన్స్ లను ఏర్పాటు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులను వినియోగానికి తోడ్పడే విధంగా మార్చడానికి ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కోరారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఉత్పాదకత చాలా తక్కువగా ఉందని, నీటి పారుదల సౌకర్యాలతో పాటు మంచి ఎరువులు, క్రిమి సంహారక మందులతో పాటు మేలు రకమైన వంగడాలను పెంపొందిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. నేడు అమల్లో ఉన్న సాగు నీటిపారుదల ప్రాజెక్టులన్నిటిని సత్వరం పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్ లో 90 శాతం వ్యవసాయ భూమికి నీరు అందించగలమన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లబించే విధంగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. రాయలసీమలో ఎర్ర చందనము ను ఎక్కువగా ప్రోత్సహిస్తే రైతులు లాభ పడతారన్నారు. మధ్య దళారీల దోపిడీని అరికట్టి మార్కెటింగ్ సదుపాయాలను కల్పించాలని, రైతుల పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు, అడవి పందులు, జింకల నుండి రక్షణ కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 80 శాతం మంది కౌలు రైతులు వ్యవసాయం చేస్తూ అతివృష్టి, అనావృష్టి, అకాలవృష్టిలను ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అత్యధికలు కౌలు రైతులే ఉన్నారని వారిని ఆదుకోవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలపై ఉందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ భారతదేశంలో వ్యవసాయ రంగంపై 46 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారని, జాతీయ ఆదాయంలో వారు కేవలం 17 శాతం వాటా మాత్రమే పొందుతున్నారని అన్నారు. ప్రపంచ స్థూల ఉత్పత్తిలో 64 శాతం సేవల రంగం నుండి 30 శాతం పరిశ్రమల రంగం నుండి లభిస్తుండగా వ్యవసాయ రంగం వాటా కేవలం 6 శాతం మాత్రమే ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో అత్యధిక మంది పరిశ్రమలు, సేవల రంగాల పై ఆధారపడి జీవిస్తుంటే అతి తక్కువ మంది మాత్రమే వ్యవసాయ రంగం పై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. భారత దేశ వ్యవసాయ రంగంలో యాంత్రికరణను పెంచి సేవలు ,పరిశ్రమల రంగాలలో ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు ప్రసంగిస్తూ పంట భూములను వ్యవసాయే తర కార్యక్రమాలకు వినియోగించరాదనే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్.ఎస్ స్వామినాథన్ సూచనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లెక్కచేయడం లేదన్నారు. వ్యవసాయ రంగంలో అనుపస్తిత భూస్వాములు పెరుగుతున్నారని, కౌలు రైతుల సమస్యలు తీవ్రమౌతున్నాయని అన్నారు. భారీ ప్రాజెక్టులకు బదులు చిన్న తరహా ప్రాజెక్టులు, చెక్ డ్యామ్ లు, చెరువులను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ చర్చా గోష్టిలో రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, కౌలు రైతుల సంఘం అధ్యక్షులు బి. శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఈమని అప్పారావు, బీసీ మహా జనసభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, విసికె పార్టీ నేత కైలా జయసుధ తదితరులు ప్రసంగించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రజలను కలుసుకున్న మంత్రి లోకేష్



○ ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజలను కలుసుకున్నారు. నేటి సాయంత్రం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన మంత్రి నారా లోకేష్ ప్రజలను నేరుగా కలుసుకుని వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీల త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. నారా లోకేష్ స్వయంగా కలుసుకుని సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ప్రజలు ఆనందంతో వెనుదిరిగారు.

## మంగళగిరిలో ఆర్ఆర్ హ్యాండ్లూమ్స్ షోరూమ్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణం జీఆర్ స్కూల్ రోడ్ లో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య మనవడు ఆర్.రోహిత్ బాబు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్ఆర్ హ్యాండ్లూమ్స్ షోరూమ్ ను విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా షోరూమ్ వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు, స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి షోరూమ్ ను లాంఛనంగా ప్రారంభించారు. షోరూమ్ మొత్తం కలియతిరిగి చేనేత వస్త్రాలను పరిశీలించారు. నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి కోసం చేనేత చీరలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇవి ప్రజాస్వామ్యం ఎన్నికలా?



మొదటి పేజీ తరువాయి

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలు మొత్తం రిగ్గింగ్ జరిగాయన్నారు. వైసిపి ఏజెంట్లు లేకుండా పోలింగు ప్రక్రియ నిర్వహించారని, ఎక్కడికక్కడ ఏజెంట్ల ఫారాలు చింపేసి టిడిపి దౌర్జన్యం చేసిందని ఆరోపించారు. పోలింగు కేంద్రాల నుండి వైసిపి ఏజెంట్లను తరిమేశారని పేర్కొన్నారు. పోలీసు సహకారంతోనే అధికార పార్టీ దౌర్జన్యకాండ నిర్వహించిందని తెలిపారు. పులివెందుల జడ్‌పిటిసిలో ఆరు పంచాయతీలుంటే 700 మంది పోలీసులను నియమించారని తెలిపారు. ప్రతి పోలింగు కేంద్రం వద్ద 400 మంది టిడిపి కార్యకర్తలు అలా దాదాపు ఎనిమిది వేలమంది వచ్చారని తెలిపారు. ఇటు పోలీసులు, టిడిపి కార్యకర్తలు ఓటరుకు ఒక రౌడీ చొప్పున మోహరించారని అన్నారు. అంతా కలిసి వైసిపి నాయకులపై దాడులు, దౌర్జన్యాలు చేశారని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య ఎన్నికలంటారా? అని ప్రశ్నించారు. మంత్రులు గ్రామాలను పంచుకున్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ తిష్టవేసి యథేచ్ఛగా దాడులు చేయించారని పేర్కొన్నారు. అయినా పోలీసులు ఏ మాత్రమూ పట్టించుకోలేదని, అధికార పార్టీకి పూర్తిగా వత్తాసు పలికారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఓటర్లుగా ఉన్న ఫొటోలను, వీడియోలను ప్రదర్శించారు. ముఖ్యమంత్రికి ఆయన పరిపాలన మీద నమ్మకం ఉంటే ఇంతటి దౌర్జన్యం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బూత్‌లలో వీడియో రికార్డులను బయటకు ఇస్తే అసలు విషయం బయటకు వస్తుందని అన్నారు. రిగ్గింగు కోసం పోలింగు కేంద్రాలను మార్చేశారని, ఒక ఊరివారు మరొక ఊరిలో ఓటు వేసేలా మార్పులు చేర్పులు చేశారని, మూడు, నాలుగు కిలోమీటర్లు వెళ్లి ఓటు వేసేలా కుట్రలు పన్నారని తెలిపారు. ఓటు కోసం వెళుతున్నవారిని ఎక్కడికక్కడ కొట్టారని, వేధించారని అన్నారు.

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నల్లపురెడ్డి పల్లెలో వందల మందితో తిష్టవేస్తే పట్టించుకోలేదని, పుత్తా చైతన్య ఈ కొత్తపల్లిలో, బిటెక్ రవి కవనంపల్లిలో తిష్ట వేసి ఓటర్లను బెదిరించారని అన్నారు. వైసిపి ఓటర్లను పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారని అన్నారు. డిఐజి కోయ ప్రవీణ్.. గరికిపాటి రామ్మోహన్‌రావుకు సమీప బంధువని, ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపారని విమర్శించారు.

కాల్చిపారేస్తామంటూ ఓ డిఎస్‌పి బెదిరింపులకు దిగారని వివరించారు. కోయప్రవీణ్ తెలుగుదేశం కార్యకర్తలా పనిచేశారని ఆరోపించారు. కవనంపల్లి సర్పంచ్ ఇంట్లో తుపాకీ పెట్టి మరీ బెదిరించారని అన్నారు. ఒంటిమిట్టలో మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతోనే నక్సలిజం పుడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలన్నీ భవిష్యత్‌లో టిడిపి నాయకులకు చుట్టుకుంటాయని తెలిపారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావొచ్చుని, ఇప్పటికైనా మార్పు తెచ్చుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని అన్నారు.

**రాహుల్ గాంధీతో కలవాల్సిన అవసరం లేదు**

కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీతో కలవాల్సిన అవసరం లేదని జగన్ అన్నారు. గత ఎన్నికల తరువాత ఓట్లు అక్రమాలు జరిగాయని చెబితే అప్పుడు మాట్లాడలేదని, ఇప్పుడు వేర్వేరు రాష్ట్రాల అంశాలు చెబుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ హాట్‌లైన్లో చంద్రబాబుతో టచ్‌లో ఉన్నారని వివరించారు. అందుకనే రాష్ట్రంలో ఎన్నికల అక్రమాల గురించి మాట్లాడటం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్.. చంద్రబాబు గురించి మాట్లాడటం లేదని, కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించడం లేదని అన్నారు.

# మంగళగిరి నియోజకవర్గంలో నారా బ్రాహ్మణి పర్యటన

○ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలన

○ మంగళగిరిలో లక్ష్మీశారీస్ అండ్ డ్రెస్ మెటీరియల్స్ షోరూమ్ ను ప్రారంభించిన నారా బ్రాహ్మణి

○ కాజ గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ పార్క్ సందర్శన

○ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను పరిశీలించిన నారా బ్రాహ్మణి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి నియోజకవర్గంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా మంగళగిరి పట్టణం గోలివారివీధిలో దామర్ల వేణు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన లక్ష్మీశారీస్ అండ్ డ్రెస్ మెటీరియల్స్ షోరూమ్ ను దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ గొట్టిపాటి లక్ష్మితో కలిసి నారా బ్రాహ్మణి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా గోలివారివీధికి చేరుకున్న నారా బ్రాహ్మణికి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య లక్ష్మీ శారీస్ వారి చేనేత వస్త్ర దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. షోరూమ్ మొత్తం కలియతిరిగి చేనేత వస్త్రాలను పరిశీలించారు. డిజైన్ లకు సంబంధించిన వివరాలను, చేనేతలకు అందుతున్న మద్దతు గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చేనేతకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నారా లోకేష్ గారు గట్టి పట్టుదలతో ఉన్నారని, మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గోల్డ్ హబ్, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, పార్క్ లు వంటి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా చెప్పారు. అందరం కలిసి చేనేత రంగాన్ని కాపాడుకుందామని అన్నారు. అనంతరం చేనేత చీరను కొనుగోలు చేశారు.

**కాజ గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నారా బ్రాహ్మణి:** కాజ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నారా బ్రాహ్మణి సందర్శించారు. ముందుగా కుట్టు మిషన్ కేంద్రం వద్దకు చేరుకున్న నారా బ్రాహ్మణికి నిర్వాహకులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో నారా బ్రాహ్మణి సమావేశమయ్యారు. శిక్షణ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మిషన్ పై వారు కుట్టిన వస్త్రాలను పరిశీలించి మెచ్చుకున్నారు. అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. మన మంగళగిరి–మన లోకేష్, జై స్త్రీ శక్తి అంటూ ఈ సందర్భంగా మహిళలు నినదించారు.

**మంగళగిరి ఎస్ఎల్ఎన్ కాలనీలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్క్ సందర్శన :** మంగళగిరి పట్టణం ఎస్ఎల్ఎన్ కాలనీలో 0.35 ఎకరాల్లో రూ. 1.06 కోట్లతో మంత్రి నారా లోకేష్ గారు అభివృద్ధి చేసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పార్క్‌ను నారా బ్రాహ్మణి సందర్శించారు. పార్క్ మొత్తం కలియతిరిగారు. స్థానిక మహిళలు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్క్ ను చాలా బాగా అభివృద్ధి చేశారన్నారు. అనంతరం సరదాగా పార్క్‌లో ఏర్పాటుచేసిన ఊయల ఊగారు.

**ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను పరిశీలించిన నారా బ్రాహ్మణి :** మంగళగిరి పట్టణం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం దిగువ సన్నిధి వద్ద దివిస్ లేబరేటరీస్ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను నారా బ్రాహ్మణి పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఎగువ సన్నిధికి భక్తులు వెళ్లేందుకు ఉచితంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ బస్సును పరిశీలించారు. బస్సులోకి ఎక్కి భక్తులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో నెట్ కనెక్షన్ ఇప్పించండి



○ మున్సిపల్, సచివాలయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయండి

○ విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలం కేటాయించండి

○ ఆటోనగర్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి

○ మంత్రి నారాయణకు విన్నవించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో ప్రజలు, ఉద్యోగుల సమస్యలు, అభివృద్ధి వంటి అంశాలపై పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ బుధవారం వెలగపూడి సచివాలయంలో కలిశారు. గుంటూరు నగరంలో సమగ్ర అభివృద్ధి దిశగా పనులు చేపట్టామని, దీనికి మరింత సహకారం అందించాలని మంత్రిని కోరారు.

జిల్లాలోని సచివాలయాల్లో ఇంటర్నెట్ సదుపాయం లేక ప్రజలు, ఉద్యోగస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు సర్వీసులు అందించేందుకు అడ్డంకిగా ఉందని వివరించారు. దీంతోపాటు కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు సైతం దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మతులు చేయించాలని కోరారు.

మున్సిపాలిటీలో టీపీఎస్, ఏఈ, శానిటరీ ఇన్స్ పెక్టర్ వంటి సూపర్ వైజరీ పోస్టుల ఖాళీగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు అందిస్తోన్న సేవలతోపాటు ఈ పోస్టుల భర్తీ ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని వివరించారు. గుంటూరు నగరంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని విన్నవించారు.

సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వాన్ని మంచి పేరు వచ్చిందని తెలిపారు. గుంటూరు నగరంలోని ఆటోనగర్ లో ఎక్కువ మంది నిరుపేద కార్మికులు ఉంటారని, ఇక్కడ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమస్యలను సావధానంగా ఆలకించిన మంత్రి నారాయణ త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## ఆగస్టు 15 న స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

○ ఎస్. ఇలక్కియ, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామనే హామీ మేరకు కూటమి ప్రభుత్వం 2025 ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 15 శుక్రవారం సాయంత్రం పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సిటీ టెర్మినల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఎస్. ఇలక్కియ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో జరిపిన సమీక్షలో గౌరవ ముఖ్యమంత్రి ప్రాంగణానికి వచ్చే ఏరియాలో ఏవిధమైన ట్రాఫిక్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచిస్తూ, వారు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమం జరిగే ప్రాంతంలో తీసుకోవాల్సిన పోలీసు బందోబస్తు చర్యలను ఉన్నతాధికారులతో చర్చించారు. వేలమంది పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్ లోని సిటీ టెర్మినల్ కు వస్తారని వారికి కావలసిన త్రాగు నీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాధారణ ప్రజలకు ఏవిధమైన అడ్డంకులు కలగకూడదన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. నగరంలో ట్రాఫిక్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని, బస్సులకు ఏవిధమైన అంతరాయం కలగకుండా సజావుగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తి అయ్యే వరకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అందరు మహిళలే వస్తున్నందున్న దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులకు సూచించారు. సమీక్ష అనంతరం వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అంతేకాకుండా పబ్లిక్ గ్యాలరీ తదితరమైన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. గౌరవ ముఖ్యమంత్రి వచ్చే ప్రదేశం, వెళ్లే ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి ప్రారంభించే బస్సులు ఉంచే ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, డీసీపీ (ఐఎస్ డబ్ల్యూ) ఎస్వీడీ ప్రసాద్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎమ్.వై. దానం, ఆర్టీసీ ఈడీ జీ. విజయ రత్నం, అసిస్టెంట్ డైరెక్టర్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ నాన్ క్యాడర్ ఎస్పీ టి. శోభా మంజరి, ఏసీపీ సౌత్ (లా అండ్ ఆర్డర్) డి. పవన్ కుమార్, ఆర్ అండ్ బీ డీఈ శశిభూషణ్, సెంట్రల్ ఎమ్మార్వో వెంకట్రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించండి

○ మంత్రి పొంగూరు నారాయణను కోరిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు తగిన నిధుల మంజూరుపై మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి బుధవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పశ్చిమ నియోజకవర్గ ప్రజలను వేధిస్తున్న ముఖ్య సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో వీధి కుక్కల నియంత్రణ, ఖాళీ స్థలాల శుభ్రపరిచే చర్యలు, కాలువల శుభ్రత, మౌళిక వసతుల మెరుగుదల, డ్రైనేజ్ సమస్యలు ఉన్నాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "గుంటూరు పశ్చిమ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం మా ప్రధాన లక్ష్యం. వీధి కుక్కల సమస్య, పారిశుద్ధ్య లోపాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని మంత్రిని కోరాను. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నేను నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ ఈ సమస్యలను సానుకూలంగా పరిగణించి, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# గత పాలకుల నిర్లక్ష్య ఫలితమే మంగళగిరి ముంపు

○ డ్రైనేజి నిర్మాణాల విషయంలో ఎవరి వారే నిర్లక్ష్యం

○ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డ్రైనేజిల నిర్మాణం పేరుతో జే.ఎన్.ఎన్.యూ.ఆర్.ఎం నిధులు రూ.36 కోట్ల గోల్ మాల్...!?

○ గత పాలకులు చేసిన పాపాలే....మంగళగిరి నగర వాసులకు శాపాలు





**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్య ఫలితమే మంగళగిరి నగర ముంపుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జె.ఎన్.ఎన్. యూ.ఆర్.ఎం నిధులు సుమారు రూ. 36కోట్లతో డ్రైనేజిల నిర్మాణాలు చేపట్టారు. అయితే ఆ నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు అప్పట్లోనే గుప్పుమన్నాయి. విజిలెన్స్ దర్యాప్తు పేరుతో నానా హడావుడి చేశారు. అయితే...ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు గానీ డ్రైనేజిల నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతి మరుగున పడిపోయిందనే విమర్శలు లేకపోలేదు.

**మంగళగిరి నియోజకవర్గంలో గత పాలకులు చేసిందేమిటో...?**

భారీ వర్షం కురిస్తే చాలు నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. దీనిని బట్టి చూస్తే గత పాలకులు ప్రజల కోసం చేసిందేమిటో అర్థం అవుతోంది. మంగళగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆరుసార్లు విజయం సాధించగా... సీపీఐ నాలుగు సార్లు గెలుపొందింది. టీడీపీ, వైయస్ఆర్సీపీ చెరో రెండు సార్లు విజయం సాధించాయి. జనతా పార్టీ ఒకసారి గెలుపొందింది. 1952లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన దర్శి లక్ష్మయ్య మంగళగిరి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అదే పార్టీకి చెందిన వేములపల్లి శ్రీకృష్ణ 1962, 72 ల్లో ఎమ్మెల్యే గా విజయం సాధించారు. 1978లో జనతా పార్టీ చెందిన గాదె వెంకటరత్తయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీపీఐ ఎమ్మెల్యే గా నిమ్మగడ్డ రామ్మోహనరావు చివరి సారిగా 1994లో విజయం సాధించారు. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున మేకా కోటిరెడ్డి (1955), టి.నాగేశ్వరరావు (1967), గోలి వీరాంజనేయులు (1989), మురుగుడు హనుమంతరావు (1999, 2004), కాండ్రు కమల (2009) మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే లు గా విజయం సాధించారు.

వాస్తవానికి మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ రెండుసార్లు మాత్రమే విజయం సాధించింది. 1983లో టిడిపి తరఫున పోటీ చేసిన డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు మంగళగిరి ఎమ్మెల్యే గా గెలుపొందారు. 1985 ఎన్నికల్లో ఆయన సినీనటి జమున పై విజయం సాధించారు. ఆ తర్వాత పొత్తులో భాగంగా టిడిపి మంగళగిరి స్థానాన్ని కమ్యూనిస్టులకు కేటాయిస్తూ వచ్చింది. మళ్లీ 2014లో అంటే దాదాపూ మూడున్నర దశాబ్దాల తరువాత మంగళగిరిలో టీడీపీ పోటీ చేసింది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి వైయస్ఆర్సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేతిలో కేవలం 12 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019 లో తమ సామాజిక వర్గ నేతకు మంగళగిరి కేటాయించాలని పద్మశాలీలు చంద్రబాబును కోరినప్పటికీ... టిడిపి నారా లోకేష్‌ను బరిలోకి దింపింది. దీంతో తాము టీడీపీకి ఓటు వేయబోమని పద్మశాలి వర్గం అప్పట్లోనే బహిరంగ ప్రకటన చేసింది. ఫలితంగా వైఎస్ఆర్సిపి అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేతిలో ఐదువేల ఓట్ల తేడాతో నారా లోకేష్ ఓటమి చెందారు. అయినా లోకేష్ మంగళగిరి నియోజకవర్గాన్ని వీడలేదు. నియోజకవర్గంలోని పేద ప్రజలకు తన సొంత నిధులతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి వారి హృదయాన్ని చూరగొన్నారు. దీంతో గత ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే గా ఘన విజయం సాధించి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రిగా ఎన్నికయ్యారు. ఏడాది పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తోన్నారు. అందులో భాగంగా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సుమారు రూ. 139 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇక నియోజకవర్గ పరిధిలో పలు రహదారుల నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, కృష్ణానది ముంపుకు మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం, సీతానగరం వద్ద అపర కర్మల సత్రం, చేనేతలకు ఉచిత విద్యుత్..వంటి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు మన నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతి సదుపాయాల కల్పన కు ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. భవిష్యత్తులో మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా మంత్రి లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారు. ఇందుకు నియోజకవర్గ ప్రజలు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467